ప్రజాశక్తి

Vol. 4, no. 12

(Mar. 22, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 12

(Mar. 22, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 రైతుమహాసభ సంచిక 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక


సంపుటి 4 సంచిక 12

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 22-3-44



పుచ్చలపల్లి సుందరయ్య — పి. సి. జోషి



అఖిలభారత రైతుసంఘాధ్యక్షుడు : స్వామి సహజానంద సరస్వతి

ప్రజల ఆరోగ్యరక్షణకై

మహాసభ నిర్వాహకుల శ్రద్ధ

బెజవాడలో అఖిలభారత రైతుమహాసభ జరిగితే, కలరా - మశూచి మొదలైన అంటువ్యాధులు వ్యాపిస్తాయనీ, పట్టణంయొక్క ఆరోగ్యమంతా తలక్రిందులౌతుందనీ, కాబట్టి సభను నిషేధించవలసి యుంటుందనీ, ప్రజా వ్యతిరేకశక్తులు మొదట్లో తీవ్రంగా ప్రచారం సాగించాయి. స్థానికోద్యోగుల వైఖరికూడా అనేక సందేహాలకు కారణమయింది.

ఆరోగ్యరక్షణకై కట్టుదిట్టాలు

కాని, మహాసభ నిర్వాహకులు షుమారు లక్షమంది రైతాంగంయొక్క ఆరోగ్యాన్ని కాపాడుటకనేక కట్టుదిట్టాలు చేశారు. మరుగుదొడ్ల విషయంలోను, మంచినీళ్ళ విషయంలోను, ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి ఆహ్వానసంఘంవారు పత్రికలద్వారా, కరపత్రాలద్వారా, పోస్టర్లద్వారా ప్రచారంచేశారు. మంచినీటిని క్లోరినేట్‌చేసి సప్లయిచేయడానికి ప్రత్యేకంగా కొందరు నియమించబడ్డారు. స్త్రీలకు, పురుషులకు, ప్రత్యేకమైన మరుగుదొడ్ల సౌకర్యం చేయబడింది. వాటిని గలీజు చేయకుండా చూడ్డానికి యేర్పాట్లు చేయబడ్డాయి. ప్రజలు ఆరోగ్యవిధుల్ని అతిక్రమించకుండా చూడ్డానికి వాలంటీర్లు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. 50 మంది మ్యునిసిపల్ స్కావెంజర్లు అతి నైపుణ్యంతోను, శిక్షణతోను, వాలంటీర్లకు తోడ్పడ్డారు. ఈ 50 మందిలో 35 గురు వాలంటీర్లుగా పనిచేశారు. 3 టిన్నుల ఫినైల్‌తోను, 1 డ్రమ్ బ్లీచింగ్ పౌడర్‌తోను కొన్ని బస్తాల సున్నంతోను, డాక్టర్లు, వాలంటీర్లు ఎప్పటికప్పుడు ప్రతి అంగుళం నేలను పరిశుభ్రంగా ఉంచారు. పెద్దపెద్ద నీళ్ళకుండీల వద్ద వాలంటీర్లు నిలబడి, వేలకొలదీ ప్రజలు ఒకరితరువాత ఒకరు వరుసగా కుండలతో చకచక నీటిని తీసుకపోయేటట్లు కట్టుబాటు చేశారు.

ప్రజా వైద్యశాల

ఉన్న కొద్దిపాటి వసతులతో "ప్రజా వైద్యశాల" ఒకటి నిర్మించబడింది. అందులో 20 మంది అనుభవజ్ఞులైన డాక్టర్లు రాత్రింబగళ్లు రోగులకు మందులిస్తూ, చికిత్సలు చేస్తూ, ప్రజల మన్ననల పొందారు. వేళకు భోజనాలైనా చేయకుండా, విశ్రాంతి కొంచెం కూడా తీసుకోకుండా, డెలిగేట్లకు - ప్రేక్షకులకు - వాలంటీర్లకు మందులిస్తూ ప్రజాసేవలో లీనమైపోయారు. ప్రక్కనే అఖిలభారత రైతాంగనాయకుల ఉపన్యాసాలిస్తుంటే, వాటినివినకుండా రోగులకు చికిత్సచేస్తూ తాము నిర్వహించవలసినపనిని హృదయ పూర్వకంగా చేస్తూ వచ్చారు. ఏమి ఏకాగ్రత ! ఏమి కార్యదీక్ష !

డాక్టర్లకు సహాయంచేస్తూ దాదాపు 100 మంది వాలంటీర్లు, 8 గురు నర్సులు, వంతులప్రకారం ఆసుపత్రిలోపనిచేశారు. 10వ తారీఖు మొదలు 17 వ తారీఖు వరకు మొత్తం 5000 మందికి పైగా ఈ వైద్యశాలలో మందులీయబడ్డాయి. వచ్చిన ప్రతివ్యక్తినీ వరుసగా నిలబెట్టడం, ఒకరితర్వాత మరొకరికి చకచక మందులీయడం, అడిగిన ప్రశ్నలకు ఓపికతో జవాబులీయడం, చూస్తే, నిజంగా "ప్రజా వైద్యశాల" ఇలా ఉండాలికదా! అనిపించింది. ప్రజలుకూడా కట్టుబాట్లన్నింటిని పాటిస్తూ, డాక్టర్లకు సహాయపడ్డారు.

దెబ్బలు తగిలినవారు, జ్వరంవచ్చినవారు, విరేచనాలతో బాధపడేవారు, ఆసుపత్రిలోనే ఉండి, చికిత్సపొందడానికి యేర్పాట్లు చేయబడ్డాయి. పెద్ద ఆసుపత్రులలోవలె మంచాలు, పరుపులు, కమోడ్లువగైరాసాధనాలులేకపోయినప్పటికీ, వాటికిబదులు గోనెసంచులపరుపులు, కుండమూకుళ్ల చక్కగా ఉపయోగపడ్డాయి. ఆసుపత్రికి ఒకచివర మరుగుదొడ్డి. ఎప్పటికప్పుడు దాన్ని శుభ్రంచేయడానికి వాలంటీర్లు, మ్యునిసిపల్ స్కావెంజర్లు ఉన్నారు. రోగుల ఆహారం విషయంలో డాక్టర్లు శ్రద్ధతో పనిచేశారు. డెలిగేట్ల బసనుండి ప్రత్యేకంగా వండిన అన్నం, పాలు, మజ్జిగ తెప్పించి రోగులకిచ్చేవారు. ఈ వారం రోజులలో మొత్తం 100 మందికి పైగా రోగులు "ప్రజా వైద్యశాల"లో ఉంటూ చికిత్స పొందారు.

ఆరోగ్య ప్రదర్శనం

"రైతునగర్"లో యితర ప్రదర్శనాలతో బాటుఆరోగ్యప్రదర్శనంకూడా ఉంది. అందులో మన శరీర నిర్మాణాన్ని గురించి, ప్రతిమనిషి తినవలసిన ఆహారాన్ని గురించి, అంటు వ్యాధుల్ని గురించి, (మిగతా 2 వ పేజీలో)



మహాసభకు వచ్చిన ఒక వృద్ధురాలు

కరువును అరికట్టండి

8 వ అఖిలభారత కిసాన్‌సభ ఈ దిగువ తీర్మానం చేసింది.

భారతదేశ ప్రజలను, ప్రత్యేకంగా బెంగాల్, కేరళ, ఒరిస్సా, రాయలసీమ (ఆంధ్ర), బనియాచాంగ్ (సుర్మాలోయ) రైతులూ, వ్యవసాయకూలీలు కరువువల్ల పీడింపబడ్డారు. కరువు పీడితులకు సాయం చేయమనీ, కరువును అరికట్టమనీ, భారత దేశ రైతాంగానికి అఖిలభారత కిసాన్‌సభయొక్క సెంట్రల్ కిసాన్ కౌన్సిల్ బొంబాయి సమావేశంలో విజ్ఞప్తిచేసింది.

బెంగాల్, సుర్మాలోయలను కరువు ఎక్కువగా దెబ్బకొట్టింది. అచ్చటి రైతుసంఘాలూ, రైతులూ, కరువునూ, తత్ఫలితంగా వచ్చిన అంటువ్యాధులను అరికట్టడానికి వీరోచితంగా ప్రయత్నిస్తున్నారు. భారతదేశ రైతాంగమంతా, ముఖ్యంగా ఆంధ్ర, పంజాబు రైతులు అఖిలభారత కిసాన్‌సభ ఆదేశానుసారం, వెంటనే ఉదారంగా సాయంచేశారు.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం బెంగాల్ సహాయార్థం 20,000 మణుగుల బియ్యం ఇస్తానని చేసిన వాగ్దానాన్ని మద్రాసు ప్రభుత్వం తోసివేసినప్పటికీ, ఆంధ్ర జిల్లాలనుంచి విరాళాలు బెంగాల్‌కిసాన్‌సభకు పంపబడ్డాయి. పంజాబు రైతులు బెంగాలు కిసాన్‌సభ ద్వారా గాని, పీపుల్సు రిలీఫ్ కమిటీ ద్వారాగాని బెంగాలు సహాయార్థం రు. 1250—0—0 లు ధన ధాన్య రూపేణా పంపారు.

తోడి రైతుల దీనాలాపాల పిలుపును విని ఉదారంగా సాయంచేసిన రైతులను, తమ సహాయంద్వారా రైతాంగ ఐక్యతను ప్రత్యక్షంగా నిర్మించినందులకూ, జాతీయ ఐక్యతా నిర్మాణాన్ని ఎంతో ముందుకు తీసుకుపోయినందుకూ, అఖిలభారత కిసాన్‌సభ అభినందించుతూంది. ఈ సందర్భంలో కరువుబాధితులైన ప్రజలను రక్షించుటకొరకు పనిచేసిన ఇతర పార్టీలనూ, సంస్థలనూగూడా అభినందిస్తూంది.

ఇంత కృషిచేసినప్పటికీ కరువు బాధిత ప్రదేశాలు బీక్షపడినవి. కరువు బాధిత ప్రదేశాలు యిప్పుడు కాటకంతో అంటువ్యాధులతో నిండి, కరువులోకన్నా ఎక్కువప్రాణాలనుబలి తీసుకుంటూండటం భీతినికలిగిస్తూంది. కాబట్టి అంటువ్యాధుల నరికట్టి, పల్లె ప్రాంతాల పునర్జీవన కొరకు ఇండియాలోని బాధిత ప్రాంతాలన్నిటికీ త్వరత్వరగా సహాయంపంపడానికి నిరంతరం కృషిచేయమని భారత ప్రజలను, ప్రత్యేకంగా రైతాంగాన్ని అఖిలభారత రైతు మహాసభ కోరుతూంది.

మరియు బెంగాలులో కరువు రెండోమారు అప్పుడే పొడచూపింది. ఇప్పుడే దానిని అరికట్టి, తొలగించకపోతే భారతదేశమంతా కరువులో మునిగిపోవచ్చును. కాబట్టి, భారత రైతాంగం వెంటనే మేల్కొని ఇదివరకుకన్నా ఎక్కువశ్రద్ధగా, ఎక్కువ త్యాగంతో, ఎక్కువ నైపుణ్యంతో, ఎక్కువ ఫలప్రదంగా కృషిచేసి, కరువునెదుర్కొని ప్రజలను కాపాడవలెనని మహాసభ కోరుతూంది.

జీవితావసర వస్తువులు

8 అఖిలభారత కిసాన్‌సభ ఈ దిగువ తీర్మానం చేసింది.

జీవితావసర వస్తువులు సప్లయిచేయడంలోనూ, పంపకంలోనూ, ప్లానులేకుండా అనుసరింపబడుతూన్న నిరంకుశ విధానంవల్ల జీవితావసర వస్తువులు దొరకకుండాపోతాయని అఖిలభారత కిసాన్‌సభ ముందుగానే చూచి, ప్రభుత్వాన్ని హెచ్చరించింది. పరిస్థితులు ఈరోజున చేతులకు మించి చెడిపోయినవి. గుడ్డ, కిరోసిన్, ఉప్పు, బెల్లం, పంచదార, అగ్గిపెట్టెలు, సిల్లు, నూనె, క్రూడ్‌ఆయిల్, వ్యవసాయానికి అవసరమైన ఆయిల్‌ఇంజన్లు, క్వైనా, యితర మందులు, వ్యవసాయ పనిముట్లు, మొదలైనవాటిధరలు రైతులయొక్క, ప్రజాసామాన్యంయొక్క శక్తికిమించి పెరిగిపోతున్నాయి. ఫలితంగా దాదాపు అన్ని వస్తువులూ దొంగమార్కెట్లలోకి చేరుతున్నాయి. ఈ పరిస్థితులు ఆహార పదార్థాలమీద గూడా పనిచేస్తున్నాయి.

కాబట్టి అఖిలభారత కిసాన్ మహాసభ ప్రభుత్వాన్ని యీ క్రింది కార్యక్రమాన్ని అమలు జరుపమని కోరుతూంది.

—పల్లెటి ప్రజలకూ, ముఖ్యంగా రైతులకు జీవితావసరాలైన సరుకులనన్నీ అందజేయటానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.

—వాటిని చాలినంతగానూ, రేషను పద్ధతిమీదనూ రెగ్యులర్‌గానూఅందజేయాలి.

—ఇందుకొరకు పల్లెటి ప్రాంతాల్లో రైతుసంఘాలయొక్క, ఆహారకమిటీల యొక్క అజమాయిషీక్రింద గవర్నమెంటు కంట్రోలు దుకాణాలను తెరవాలి.

ఇక రైతులందరూ తమను తాము సంఘటితపర్చుకుని, అన్నితరగతుల పల్లెటి ప్రజలనూ ఐక్యకమిటీలలో సంఘటితపరచి అవసరమైన వస్తువులన్నిటినీ సప్లయిచేయించుకోవాలనీ, అలా సప్లయి చేయించుకున్న వస్తువులు సమిష్టి ప్రయోజనంకొరకు పరస్పర సహకారకృషితో ప్రజలలో నిర్మాణాత్మకంగా పంపకం జరిగేటట్లు కృషిచేయాలనీ రైతాంగాన్ని హెచ్చరించుతూంది.

ఇతర తీర్మానాలు

8 వ అఖిలభారత కిసాన్‌సభ ఈ దిగువ తీర్మానాలు చేసింది.

టీ, కాఫీలపైన, వక్కలపైన కొత్తగా పన్నులు విధించినందుకు, పొగాకుపై సుంకము హెచ్చించినందుకు, మూడవ తరగతి రైల్వే టిక్కెట్ల రేట్లు హెచ్చించినందుకు కిసాన్ మహాసభ అసమ్మతి తెలుపుతూంది. ఈ పన్నులు ముఖ్యంగా రైతులపైన, బీద ప్రజలపైన పడతాయి. ప్రభుత్వం తన ఆదాయం హెచ్చించుకోడానికి యీవిధంగా ప్రజాసామాన్యానికి జీవితావసరాలైన వస్తువులపై పన్నుల విధించుట న్యాయమైన విధానంకాదు. ఈ విధంగా ప్రజాభిప్రాయాన్ని, కేంద్ర శాసనసభలోని ప్రజాప్రతినిధుల వ్యతిరేకతను నిర్లక్ష్యంచేసి భరించలేని ప్రజలపై అదనంగా పన్నులభారం వేసినందుకు ప్రభుత్వ చర్యను యీ మహాసభ తీవ్రంగా ఖండించుతూంది.

సరిహద్దు రాష్ట్రంలో రీసెటిల్మెంటు ఆపుచేయాలి

కిసాన్ మహాసభ ప్రత్యేకంగా సరిహద్దు రాష్ట్రంలో జరుగనున్న రీసెటిల్మెంటును యుద్ధానంతరం వరకు ఆపుచేయాలని తీర్మానించింది. సరిహద్దు రాష్ట్రంలో కౌలుదారులకు హక్కులనొసగే చట్టాన్ని వెంటనే చేయాలని కూడ తీర్మానించింది.

సింధు రాష్ట్రంలో "హరీ" రైతులకువున్న డబ్బురూపేణ శిస్తుచెల్లించే హక్కును తొలగించడానికి జాగీర్‌దార్లు, మీర్లు చేస్తున్న ప్రయత్నాలకు కిసాన్ మహాసభ అసమ్మతి తెలుపుతూ ఒక తీర్మానం చేసింది.

సింధుశాసన సభలోవున్న లీగ్, వగైరా ప్రజాపార్టీల ప్రతినిధులను జాగీర్‌దారులప్రయత్నాలను వ్యతిరేకించాలని కిసాన్ సభకోరుతూంది. హరీస్ ఐక్యమవ్వాలని, సింధు ప్రభుత్వం హరీస్‌కు పెనెన్సీ హక్కుల నిస్తూ శాసనం చేయాలనీకూడ తీర్మానించింది.

సబ్‌కమిటీలు

ప్రత్తి, జూట్, చెరకు, పొగాకు వగైరా వర్తకపు పంటల ఖరీదులు తీవ్రమైన సంక్షోభాలకు గురిఅవుతూపండించే రైతుకు న్యాయమైన ధర గిట్టుటలేదు. వ్యాపారస్తులు విపరీతమైన లాభాలు గుంజుతున్నారు. వీటికి రైతులకు గిట్టుబాటయ్యే న్యాయమైన కనీస ధరలను నిర్ణయించాలి. ప్రజలకు అందేగరిష్ట ధరలను కూడ నిర్ణయించి నిల్వవ్యాపారస్థుల అధికలాభాలను అరికట్టాలి. ఈ విషయాలను గురించి విచారణచేసి రిపోర్టుచేయడానికి 5 గురు సభ్యులతో కూడిన సబ్‌కమిటీ నియమించబడింది. కామ్రేడ్ హర్షదేవ్‌మాలవీయ సమావేశకర్తగా వుంటాడు.

వ్యవసాయకూలీల సమస్యలను గురించి విచారించి రిపోర్టుచేయడానికి ఒక సబ్‌కమిటీ నియమించబడింది. దీనికి కామ్రేడ్ యన్. వి. పెరులేకర్ సమావేశ కర్తగా వుంటాడు.

సంస్థాన ప్రజల కష్టాలు

8 వ అఖిలభారత కిసాన్‌సభ ఈ దిగువ తీర్మానం చేసింది.

భారత సంస్థానాలు తమప్రజలూ, రైతు సంఘాలు, మరి అలాంటి సంస్థలూ, కోరిన కోర్కెలలో ఒక్కదానినీ పాటించలేదు తమ ప్రజలపైనా, ముఖ్యంగా రైతులపైనా, బలవంతపు వసూళ్ళను రద్దుచేయలేదు. వారికి పౌరస్వాతంత్ర్యమూ, మరి యితరహక్కులూ, యివ్వబడలేదు. ఒరిస్సాలోని నీలగిరి సంస్థానంలో ఆహారసంక్షోభం తొలగించటానికి కృషిచేస్తున్న రైతుసంఘ వర్కర్లు అందరూ జైల్లో పెట్టబడ్డారు. గ్వాలియరు సంస్థానంలో గ్వాలియర్‌సంస్థానరైతుసంఘం రిజిస్టరుచేయబడలేదనేనెపంమీదని షేధింపప్రయత్నించారు. రైతులు తమభూములనుండివెళ్ళగొట్టబడ్డారు. పాటియాలా సంస్థానంలో సంస్థాన ప్రభుత్వం చేత భూస్వాములకూ, రైతులకూ భూమిపై ఎంతెంతహక్కుఉన్నదీవిచారించుటకు, నియమించబడిన పెనెన్సీకమిషన్ లేక రావుకమిషన్‌యొక్క రిపోర్టు ప్రచురింపబడటంలేదు.

సంస్థాన ప్రజలందరికీ పౌరస్వాతంత్ర్యం యీయవలెననీ, సంస్థానాలలోని ప్రజలూ, ప్రజామండలులూ తమ సంఘటితశక్తిద్వారా తమకున్న యితర కష్టాలను తొలగించుకోవలెననీ మరలహెచ్చరించుతూంది. మరియూ:

1. కిసాన్‌సభ వర్కర్లనూ, అర్గనైజర్లను వెంటనే విడుదలచేయవలెను.
2. గ్వాలియరుస్టేట్ కిసాన్‌సభను ఏమీ అడ్డంకులు లేకుండా పనిచేయనీయవలెను.
3. పాటియాలా పెనెన్సీకమిషన్ రిపోర్టు ప్రచురింపబడవలెను. గ్వాలియరు, సెంట్రల్ యిండియా స్టేట్లలాంటి అన్ని సంస్థానాల్లోని ప్రజల న్యాయమైన హక్కులను గుర్తించుతూ చట్టాలు చేయబడవలెను.
4. రైతులను సర్వనాశనాన్నుంచికాపాడటానికి వ్యవసాయఋణపరిష్కారచట్టంచేయాలి.

భారతదేశ తూర్పు సరిహద్దునవున్న మనిపూర్ సంస్థానం అతి ముఖ్యమైన కీలకస్థానములోవుంది. అక్కడ ఆహార కొరత, పశువులకొరత యేర్పడ్డవి. వచ్చేనెలల్లో కరువు ఎదురుచూస్తూంది. కరువు వెన్నంటియుండే ప్రదేశమైన మనిపూర్ సంస్థానంలో ప్రజలకు పూర్తి పౌరసత్వ హక్కులీయాలనీ, ఆహార పదార్థాలను దిగుమతిచేసి ప్రజల అజమాయిషీక్రింద పంపకం జరపాలనీ, పశువులను, వ్యవసాయ పనిముట్లనూ ప్రభుత్వమే కొని దిగుమతిచేయాలనీ, గుడ్డ, కిరోసిన్, నూనె, మందులూ మొదలైన జీవితావసర వస్తువులను రెగ్యులరుగా చాలినంత సప్లయి చేయాలనీ, ఇలాచేయటంద్వారాఆసంస్థానాన్ని బలపరచాలనీ అఖిల భారత రైతు సంఘం ప్రభుత్వాన్ని కోరుతున్నది.

(1వ పేజీ తరువాయి) గ్రామ పారిశుద్ధ్యాన్ని గురించి, తాత్కాలిక సంతాన నిరోధాన్ని గురించి, మాతాశిశురక్షణను గురించి, అనేక చిత్రాలు, పదార్థాలుచూపబడ్డాయి. ఒక్కొక్క చిత్రాన్నిగురించి 4గురు డాక్టర్లువాలంటీర్లసహాయంతో ప్రజలందరికీ అర్థమయేలా బోధించారు. ఆరోగ్యవంతమైన ఆహారపదార్థాలు, మాతాశిశురక్షణ, తాత్కాలిక సంతాన నిరోధం ప్రజల్ని యెక్కువగా ఆకర్షించాయి. శాస్త్రీయ జీవిత విధానాన్ని గురించి యింకా తెలుసుకోవాలనే కుతూహలం చూపెట్టారు.

మొత్తంమీద, రైతుమహాసభ దిగ్విజయముగా కొనసాగుటకు "ప్రజావైద్యశాల" ఎంతో తోడ్పడింది. 15 వ తేదీని మద్రాసు ప్రభుత్వ ఆరోగ్యశాఖకు అసిస్టెంట్ డైరెక్టరు వచ్చి వైద్యశాల, ఆరోగ్యవసతులు, చూచి సంతృప్తిని ప్రకటించారు. ప్రజలు ఈకృషిని కొనియాడారు.

కామ్రేడ్ పృథ్విసింగ్ సంచారం

కామ్రేడ్ పృథ్విసింగ్ ఆంధ్రదేశంలో ఈదిగువ కార్యక్రమంప్రకారం సంచారం చేస్తారు.

కార్యక్రమం:

మార్చి	20 తేదీ	బెజవాడ
	22	గుడివాడ
	23	బందరు
	24	చల్లపల్లి
	25	రేపల్లె
	26	గుంటూరు
	27	నర్సారావుపేట
	28	తెనాలి
	29	బాపట్ల
	31	ఏలూరు
ఏప్రిల్	1	పాలకొల్లు
	2	భీమవరం
	3	రాజమండ్రి
	4	కాకినాడ
	5	రామచంద్రపురం
	6	బెజవాడకు తిరిగి వచ్చుట
	7	నంద్యాల
	8	కర్నూలు
	9	హైద్రాబాద్

దేశవ్యాపిత కుటుంబం ★ కమ్యూనిస్టుపార్టీ

ఆంధ్రలో పార్టీ స్థానం



పి. సి. జోషీ

8 వ రైతుమహాసభ సందర్భంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభిస్తూ జోషీ ఇలా అన్నాడు.

ఆంధ్రకార్మిక, కర్షక సోదరులారా!

నేను చెప్పదలచుకున్న విషయం చాల పెద్దది - కష్టమయిందికూడాను. ఆంధ్రలో పార్టీ స్థానం - ముఖ్యంగా వైజ్ఞానిక రంగంలోను, ఆంధ్ర సామాజిక జీవితంలోను పార్టీ స్థానం ఏమిటి? ఇదీ నేను చెప్పదలచుకున్న విషయం.

ఆంధ్ర రైతాంగమయిన మీరు ఈనాడు కమ్యూనిస్టుపార్టీని బాగా ఎరుగుదురు. ప్రపంచంలోని మరే ఇతరరాజకీయపక్షంకన్న దీన్ని - మీ కొమాళ్ళు, మీ కొమార్తెలు ఉన్న ఈ పార్టీని గురించి ఎక్కువ తెలుసుమీకు. దీనితో మీకెక్కువ సన్నిహిత సంబంధంఉంది.

ఎందువల్ల?

'మీ బిడ్డలే కమ్యూనిస్టులు'

ఆంధ్రలో ఇదివరకు కని విని ఎరుగనంతటి మహాసమావేశం ఈనాడిక్కడ జరుగుతూంది. ఉదయం (14 వ తేదీ) బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. ఈ నాడు మీకన్నా సగర్వంగా ఛాతీచరచుకు తిరగగలవారు ప్రపంచంలో మరెవ్వరూ లేరనడం సుస్పష్టం. ఇదంతాచూచి హృదయంలో ఆనందం తాండవించని, ముఖంలో సంతోషం చిందులు తొక్కని రైతుబాబు, రైతుమాత ఆంధ్రలో ఈనాడు ఒక్కరుకూడా ఉండరు.

మీకింత గర్వకారణమయిన, మీకింత పండుగకూర్చిన ఈ మహోత్సవం ఎవరికృషి ఫలితం? మీ కొమాళ్ళ, మీ కొమార్తెల శ్రమ ఫలితం ఇదంతా. మీరేకాదు - మీ తరువాత తరువాత వచ్చే మీ మనవళ్ళుకూడా గర్వపడగల ఘనకార్యాన్ని ఈనాడు సాధించారు మీ బిడ్డలు.

దేశవ్యాపిత కుటుంబం

వారిపాటలు కొన్ని విన్నారు. మీ బిడ్డలొక్కరేకాదు—వారితోపాటు బెంగాల్, బొంబాయి, మహారాష్ట్ర, మలబార్ మొదలయిన ఇతర రాష్ట్రాల్లోని మీ సోదర రైతులబిడ్డలు కూడా ఉత్తేజకరంగా పాడారు. అంటే అర్థం ఏమిటి? మీ ముద్దుబిడ్డలు మీచుట్టూ ఏకృషిని సాగిస్తున్నారో, ఆ దేకృషిని ఇతర రాష్ట్రాల్లోని మీ తోడి రైతులబిడ్డలు, వాళ్ల తలిదండ్రుల ఎదుట కొనసాగిస్తున్నారు. మీబిడ్డలు, ఇతర రాష్ట్రాల్లోని ఆ రైతుబిడ్డలు - వీళ్ళంతా ఒక్క కుటుంబంవారు-కమ్యూనిస్టు కుటుంబంవారు. ఇంత పెద్దకుటుంబం ఈనాడు మరొకటిలేదు. ఆరేండ్లక్రితం ఒకసారి నేను ఆంధ్రదేశానికి వచ్చాను. కాని ప్రజలఎదుటికి వెళ్ళలేదు. పార్టీ సభ్యులను మాత్రం కలుసుకొని - ప్రజలనెలా సమీకరించడమో చర్చించుకొన్నాము. ఆరోజుల్లో మీవైఖరి ఎలాఉండేది? మేము సాధించదలచుకొన్న ఆశయం మంచిదే అని మీరు అంగీకరించారు. "స్వాతంత్ర్యం రావడం మంచిదే - కాని దానికోసం నాబిడ్డ లెందుకు కష్టాలుపడాలి; ఎందుకు త్యాగాలుచేయాలి?" ఇదీ అప్పటి మీ ధోరణి. కాని ఈనాడు మీ బిడ్డలు సాధించినవాటినిచూచి మీరు గర్వపడుతున్నారు; వారి త్యాగాలనుచూచి మెచ్చుకొంటున్నారు.

మీ కొమాళ్ళు, కొమార్తెలు ఏవిధంగా మీ కుటుంబసభ్యులో - అదేవిధంగా వారు కమ్యూనిస్టుపార్టీ అనేదేశభక్తుల కుటుంబంలో కూడా సభ్యులు. వారుచేసిన ఘనకార్యాలను చూచి మీరేవిధంగా గర్వపడుతున్నారో అదే విధంగా మేమందరంకూడా గర్వపడుతున్నాం.

జాతీయోద్యమంలో పుట్టుక

ఈ కమ్యూనిస్టు కుటుంబం ఎలా పుట్టింది? దీనిపుట్టుక 1930 జాతీయోద్యంలో. జాతీయ కాంగ్రెసు నాయకత్వం కింద స్వాతంత్ర్యం సాధించాలనే ఆశతో ఎందరో యువకులు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కాని, ఎంతదీక్షతో ఆ ఉద్యమంలో పోరాడినా స్వాతంత్ర్యం మాత్రం లభించలేదు అప్పటి నిస్పృహలో వారికొక ఆశాజ్యోతి కనిపించింది. వారిదృష్టి సోవియట్ రాజ్యం వైపు తిరిగింది. అక్కడి ప్రజలు సాధించిన అద్భుత విజయాలు వీరిని ఉత్తేజపరిచాయి. ఆ విజయాలు ఈ యువకులకు రెండు పాఠాలు నేర్పాయి.

— దేశభక్తులు తమ సోదరప్రజలను సంఘటిత పరిస్తేనేగాని దేశానికి స్వాతంత్ర్యం లభించదు.

— దేశభక్తులందరూ ఒకపార్టీలో— కమ్యూనిస్టుపార్టీలో- సంఘటితమయిననాడేవారు ప్రజల నందరిని సంఘటితపరచగలరు

ఈ రెండుపాఠాలు వారు గుర్తించడంతో మన దేశంలో కమ్యూనిస్టుపార్టీజన్మించింది. అప్పటి నుండి కమ్యూనిస్టుపార్టీ- ఈ పెద్దకుటుంబం- నానాటికీ పెరుగుతూ వచ్చింది. ఒక్కఆంధ్ర దేశంలోనే ఈకుటుంబం పదేళ్ళలో 5000 సభ్యత్వానికి పెరిగింది.

రైతులే పునాది

ఆంధ్రలో మా తలిదండ్రులు మీరే- రైతులే. అందువల్ల మీలోనే మొట్టమొదట మా ఉద్యమం ప్రారంభించాము. రైతు ఉద్యమంయొక్క చరిత్ర మీకు నేను వేరేచెప్పనక్కరలేదు. మీ బిడ్డలమయిన ఈ 5000 మంది కమ్యూనిస్టులం మీ మధ్య కృషిచేస్తూ, ఈనాటికి లక్షకుపైగా సభ్యత్వంగల బలీయమైన రైతుసంఘాన్ని నిర్మించాము. అంతేకాదు. దేశం అంతా నిరాశ, నిస్పృహల్లో మునిగి ఉన్న ఈనాడు, మిమ్మల్ని ఉత్సాహపరచి, మీలో కార్యదీక్షను రేకెత్తిస్తున్నాము. కరువు కాటకాలతో దేశం అల్లకల్లోల మవుతూన్న రోజుల్లో, అధికాహారోత్పత్తి ఉద్యమాన్ని నడిపి ప్రజలకు ఆహారం అందివ్వడానికి కృషి చేస్తున్నాం ఒక్క ఏడాదిలో 12000 యకరాల బంజరుని మీకిప్పించాం. మీలో అదివరకే భూములున్నవారికి ఇతర సౌకర్యాలెన్నో కలిగించాం. మద్రాసు ప్రభుత్వం 25 లక్షల రూపాయీల ఎరువును అప్పుగా ఇవ్వడానికి ఏర్పాటు చేసింది. దీనిలో 4,25,000 రూపాయీల ఎరువును మీకిప్పించాం. రైతు సంఘమే లేకపోతే, మీ బిడ్డలయిన కమ్యూనిస్టులే లేకపోతే, ఈ 25 లక్షల ఎరువు ఋణంలో అధికభాగం మీకు అందకుండాపాడయేది. ఇంకా నీటిపారుదల సౌకర్యాలెన్నో కలిగించాం.

మిమ్మల్నిఒకసంఘటితశక్తిగానిర్మించాం: మీ హక్కుల నెన్నిటినో సాధించాం. మీ బిడ్డల నుండి ఇంతకన్న మీరు కోరేదింకేముంటుంది.

ఇతర రంగాల్లో

మేమింతటితో తృప్తిచెందలేదు. వ్యవసాయకూలీలనుకూడా సంఘటిత పరచడం ప్రారంభించాం.

రైతులకు, వ్యవసాయకూలీలకు ఏమంత పొత్తు ఉండేదికాదన్నసంగతి మీరెరిగినదే. ఇప్పుడు మీబిడ్డలు వ్యవసాయకూలీలనుకూడా సంఘటితపరిచారు. ఆంధ్రలో 29000 మంది వ్యవసాయకూలీలు సంఘసభ్యులుగాఉన్నారు. ఈ నిర్మాణంతో రైతుకూలీ సామరస్యం పెంపొందసాగింది; గ్రామజీవనంలోనేమార్పు ప్రారంభమయింది.

మాకృషి ఇంకా ఇతరరంగాలకు విస్తరించ సాగింది. రైతులకు, కూలీలకు చెందని ఇతర యువకులనుకూడా ఒక నిర్మాణశక్తిగా సంఘటితపరచ పూనుకొన్నాం. వాళ్ల కోసం కార్యక్రమం నిర్ణయించుకున్నాం. వాళ్ళనాకర్షించగల ఆటలు, కళాప్రదర్శనలు, రాత్రి పాఠశాలలు విరివిగా వ్యాపింపజేశాం. వీటిద్వారా 24000 మంది యువకుల్ని సంఘటిత పరచగలిగాం. వీరిలోఉత్తములు 10,000 మంది ప్రజారక్షణ దళంగా నిర్మాణమయారు. ఏసమయంలోనయినా, ఏ పరిస్థితిలోనయినా, ఈ దళంవారు ప్రజాసేవలో తమ ప్రాణాలనయినా అర్పించడానికి సిద్ధంగా ఉంటారు.

దేశభక్తుల మహాసైన్యం

ఒక్కసారి ఈ కృషి నంతటినీ పర్యాలోకించండి. కనబడే దృశ్యం చూడండి. మీ బిడ్డలు- 5000 మంది కమ్యూనిస్టులు అగ్రదళంగా నిలచిఉన్నారు. వారివెనుక 10,000 మంది ప్రజారక్షణదళం - ఆవెనుక 24,000 మంది యువజనసంఘ సభ్యులు - తరువాత 29,000 మంది వ్యవసాయకూలీలు - ఆపైని ఈ నిర్మాణం అంతటికీ మూలాధారంగా ఒక లక్షమంది రైతుసంఘం. దేశభక్తుల మహాసైన్యం ఈవిధంగా బారులుతీరి వుండడం కనబడుతుంది.

రైతు స్త్రీలకు జేజేలు

అంతేకాదు. మేము, మీరు అన్నిటికన్న ఎక్కువగా గర్వపడవలసిన విషయం ఒకటుంది. అదే 20,000 సభ్యత్వంగల మహిళాసంఘం. రైతు స్త్రీలకన్న పట్టణవాసపు మహిళలు ఎక్కువ నాగరకత కలవారని దంభాలు కొడతారు. కాని ఈనాడు జరిగిన ఊరేగింపులో వేలకొలది రైతుస్త్రీలు, చైతన్యం ఉట్టిపడేలా, నాగరకత, అభివృద్ధులకు చిహ్నంలాగా బారులుతీరి సాగిపోతూంటే ఈ పట్టణవాసంవారు తెల్లమొగం వేయటం నేను చూచాను.

గత నాలుగు కాంగ్రెసు మహాసభల్లోనూ నేను పాల్గొన్నాను. ఈ రైతుమహాసభకు వచ్చినంతమంది స్త్రీలు ఆ సభల్లో దేనికి రాలేదని అనుభవంమీద చెబుతున్నాను. మా తండ్రుల్లోను, అన్నదమ్ముల్లోనే కాకుండా, మాతల్లుల్లోను, అక్కచెల్లెండ్రలోను కూడా దేశభక్తిని, చైతన్యాన్ని పెంపొందించినందుకు మేమెంతో గర్వపడుతున్నాము.

మీ బిడ్డల మయిన మేము ఇలా అందరినీ సంఘటితపరచుకొని ముందుకుసాగిపోతున్నప్పుడుమా చిట్టితమ్ములుకూడా మా వెంటరావడంలోఆశ్చర్యం ఏమీలేదు. గత 9 మాసాల్లో బాలసంఘ సభ్యత్వం 18,000 కు పెరిగింది.

కార్మికుల్లో

ఈ విధంగా గ్రామజీవితంలో సర్వతోముఖమైన మార్పు తేవడంతోనే మేము తృప్తిపడలేదు. పట్టణాల్లోని కార్మికరంగానికి కూడా మా కృషిని వ్యాపింపజేశాం. పట్టణాల్లోని ధనికులు కార్మికుల రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తున్నారు. ఈ పీడిత కార్మికలోకాన్ని సంఘటిత శక్తిగా నిర్మించ పూనుకున్నాం.

25000 మంది సభ్యులుగల కార్మికసంఘాలను (ఆంధ్రలోనే) నిర్మించాం. కార్మికరంగానికి మా ఋణం ఈవిధంగా తీర్చుకున్నాం. రైతుబిడ్డలమయిన మేము ప్రజలను ఎలా సంఘటితపరచడమో బొంబాయి, కాన్పూరు, కలకత్తా కార్మికరంగాలనుంచి నేర్చుకున్నాం. నేర్చుకున్న పాఠాలను రైతురంగంలో అమలు జరిపి అనుభవంగడించాం. ఈ అనుభవాన్ని ఉపయోగించుకొని కార్మికరంగాన్ని సంఘటిత పరచ ప్రారంభించాం.

విజ్ఞానరంగం

ఈ విధంగా నిర్మాణకృషి సాగించడమే కాదు మేము చేస్తున్నపని. జాతియొక్కవిజ్ఞాన తంత్రులనుకూడా మోగిస్తున్నాము. ప్రభుత్వం మనజాతీయవిజ్ఞానాన్ని అభివృద్ధికానీయకుండా అణచివేస్తూంది. రెండేళ్ళక్రితం మన జాతీయ కళలు ఎక్కడా వికసించలేదు. మీ కొమారులు, కొమార్తెలు వీటినిప్పుడు పునరుద్ధరించి, జాతివికాసానికి బలమయిన సాధనాలుగ తయారుచేస్తున్నారు.

ఇప్పుడు మీరుచూసే కళారూపాలు మీరు సృష్టించినవీకావు, మేము కనిపెట్టినవీకావు. మన తాత ముత్తాతలు ఈకళారూపాలన్నిటినీ సృష్టించారు. మేము చేసిన పనంతా దేశభక్తిని, చైతన్యాన్ని పెంపొందించే విషయాలను, వస్తువును ఈ రూపాల్లో పెట్టడమే. ఈ విధంగా మన పురాతన కళారూపాలన్నీ ఈనాడు స్వాతంత్ర్యపోరాటంలో బలమయిన సాధనాలుగా మారాయి. వినోదం ఇవ్వడంతోపాటు జాతి నిర్మాణాన్నికూడా కొనసాగించగలదశకు మీ బిడ్డలు వీటిని తీసుకువస్తున్నారు.

నాడు - నేడు

ఒక విషయం చూడండి. సాయంత్రం (14 వ తేదీ) జరిగిన సభలో నాయకులు చెప్పిన విషయం - ఇప్పుడు (రాత్రి) కళారూపాల్లో బోధిస్తున్నవిషయం ఒక్కటే. అదే దేశభక్తిప్రబోధం. కాని,అప్పటికన్నాఇప్పుడు ఈ లక్షమందిప్రజలు ఎక్కువ ఉత్సాహంతో, ఎక్కువ శ్రద్ధతో వింటున్నారు. కారణం ఏమిటి? సాయంత్రం వ్యక్తులు ఉపన్యాసాలిచ్చారు. ఇప్పుడు జాతీయ కళారూపాలు ప్రబోధం సాగించాయి. ప్రజల హృదయాలనిది ఎక్కువగా ఆకర్షించింది.

ఈవిధంగా కమ్యూనిస్టుపార్టీ - మీ బిడ్డల పార్టీ ప్రజల్లో గాఢమైన దేశభక్తిని అమరజ్యోతిగా రగుల్చుతూంది. (మిగతా 4పేజీ)

ప్రజలకోసం పాటుపడడమే స్వాతంత్ర్యోద్యమ ఆశయం

(3 వ పేజీ తరువాయి) గత పదేళ్ళలో ప్రజల్లో వివిధవర్గాలను దేశభక్తియుత ఉద్యమాల్లో సంఘటిత పరిచింది. ఈనాటి ఆంధ్రదేశాన్ని పదేళ్ళనాటి ఆంధ్రదేశంతో ఎవరయినా పోల్చి చూడవచ్చు. మునుపటికన్నా ఎక్కువగా నేటి ఆంధ్రదేశం దేశభక్తితో ప్రజ్వలిస్తూంది; మునుపటికన్నా సంఘటితమై వుంది.

విచారకర విషయం

పార్టీ సాగించిన ఈ కృషినంతటినీ చూచి ప్రతివ్యక్తి సంతోషిస్తాడని నేను ఆశించాను. ఇది సహజమే. కాని, అలా జరక్కపోవడం చూచి చాల విచారించాను. ప్రజల్లో పార్టీ దేశభక్తిని పెంపొందించిందని ఆంధ్రలో కొందరు కాంగ్రెసువాదు లనుకోవడం లేదు. వారు భావిస్తున్నది తద్వ్యతిరేకం.

నేను ఆంధ్రకు వచ్చి ఆరేళ్ళు గడిచాయి. ఇక్కడి కాంగ్రెసు ముఖ్యుల్ని కలుసుకొని అన్నివిషయాలు సాకల్యంగా చర్చించాలనుకొన్నాను. అతిదిగా వచ్చిన ఒక దేశసేవకునిగా నన్ను ఆదరిస్తారని ఆశించాను. సహృదయంతో అభిప్రాయభేదాలను చర్చిస్తారని ఎదురుచూచాను. ఇంతకూ భారతీయులం మన నాగరకతా ఔన్నత్యానికి, ముఖ్యంగా అతిథి సత్కారానికి పేరుపొందినవాళ్ళం; కష్టపడి పనిచేసేవారిని ఎంతో ఆదరించడం మన సాంప్రదాయం.

కాని, ఈ కాంగ్రెసుప్రముఖులు మమ్మల్ని బ్రిటిషు ప్రభుత్వ ఏజంటులనీ, మాలో దేశభక్తి లేదనీ ఆడిపోశారు.

ఎవరిని ఆడిపోసినట్లు?

దేశభక్తియుతమయిన ఒక సంస్థను సామ్రాజ్యవాద ప్రభుత్వపు ఏజంటని అనడం చిన్నవిషయం కాదు. ఈ కాంగ్రెసువాదుల ఆడిపోతలు మమ్మల్నేకాదు- మా కృషిఫలితంగా సంఘటితమయిన మీలక్షమంది రైతాంగాన్ని కూడా అవమానపరుస్తూంది. మీరు లక్షమంది దేశభక్తులు- ఎవ్వరూ కాదనసాహసించలేరు. మేము ఆంధ్రలో 5000 మందిమి మాత్రమే. కొద్దిమందిమయిన మా చేతిలో పడి మీరందరూ మోసపోతున్నారనడం, మీ వ్యక్తిత్వాన్ని, మీ బుద్ధిని నీచంగా అవమానించడమన్నమాట.

కమ్యూనిస్టుపార్టీ అంటే—

ఈ కాంగ్రెసువాదుల్లో కొంతమంది నేటి ఉదయం జరిగిన బ్రహ్మాండమయిన ఊరేగింపును చూచిఉంటారు. అది చూచినతరువాత వారు తమ అభిప్రాయాన్ని మార్చుకొంటారని అనుకుంటాను.

జాతీయ కాంగ్రెసు మహాసంస్థ ప్రజల్లో రేకెత్తించినదేశభక్తి నేడు కమ్యూనిస్టుపార్టీలో మూర్తీభవించి వుందన్న విషయాన్ని వీరు గుర్తించాలి. కమ్యూనిస్టుల్ని ఆడిపోయడంలో వారు ఒక సోదర దేశభక్తియుత సంస్థను అవమానించడమే కాకుండా, యావద్దేశాన్ని, కాంగ్రెసు మహాసంస్థ సాంప్రదాయాన్నికూడా అవమానించారన్న విషయాన్ని వారు గుర్తించెదరు గాక.

వీరితో తర్కవితర్కాలు పెట్టుకోవాలని నేనెప్పుడూ అనుకోలేదు. కాని, వీరు కాంగ్రెసుకి, కాంగ్రెసు కార్యక్రమానికి, అపార్థాలు కల్పిస్తున్నారు. కాంగ్రెసుచేసిన కృషి నంతటినీ కమ్యూనిస్టుపార్టీ కొనసాగిస్తూంది. అంతేకాదు. అంతకన్నా ప్రస్ఫుటమైన, అంతకన్నా ఉన్నతమైన ఆశయాలకోసం కమ్యూనిస్టుపార్టీ కృషిచేస్తూంది. మమ్మల్ని ఆడిపోస్తున్న కాంగ్రెసువాదులు మాకృషిని అపార్థం చేసుకుంటున్నారు.

మాకృషిని కళ్ళారచూచిన వారెవరయినా మేము సామ్రాజ్యవాద ప్రభుత్వానికి మద్దతునిస్తున్నామని ఎలా అనుకోగలరా అని నేనాలోచించాను.

మేము చేస్తున్న దేమిటి?

దేశరక్షణ సమస్యకే మేము అన్నిటికన్నా ప్రాధాన్యాన్నిస్తున్నాము. జపాను వ్యతిరేక ప్రచారం సాగిస్తూ, ప్రజల్లో దేశరక్షణదీక్షను బలపరుస్తున్నాము. ఇది బ్రిటిషు ప్రభుత్వానికి మద్దతివ్వడం అనిపించుకుంటుందా?

నిషేధం రాకపూర్వమే కాంగ్రెసు మహాసంస్థ ఫాసిస్టు ప్రతికూలతీర్మానం చేసింది. ఈయుద్ధంలో రెండు పక్షాలున్నాయని - ఒకటి ప్రజాపక్షం, రెండోది ఫాసిస్టుపక్షం అని గుర్తించింది. ఈనాడు ఆ నాయకులు జైళ్ళల్లో వున్నారు. వారి ఫాసిస్టు ప్రతికూల సంప్రదాయాన్ని కాపాడుతున్న దెవరు:కమ్యూనిస్టులా? లేక మమ్మల్నాడి పోస్తున్న ఈ కాంగ్రెసువాదులా?

ఆగస్టు 9 ఘటనల్ని చూచి ఈ కాంగ్రెసువాదులుఅదేస్వాతంత్ర్యపోరాటమనుకున్నారు. కమ్యూనిస్టుపార్టీ అప్పుడే హెచ్చరికచేసింది - ఇది జాతీయోద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిషు ప్రభుత్వం వేసిన ఎత్తు అని. మేము చెప్పినది నిజమని, గాంధీజీ లేఖలు, సరోజినీదేవి ప్రకటనలు ఋజువుచేశాయి. కమ్యూనిస్టులదా, లేక వారిని ఆడిపోసేవారిదా - దేశభక్తి పంథా? ఎవరిదో మీరే నిర్ణయించండి.

ఇక ఆహారసమస్య చూడండి. కరువు రాబోతూందని ముందుగానే గుర్తించి. ప్రజలను, దేశాన్ని కాపాడడానికి అంతా ఏకంకావాలని విజ్ఞప్తిచేశాం. ప్రజల కందుబాటులో ఉండేలా ఆహారపదార్థాల ధరలు నిర్ణయించాలని కోరాము, తిండిదొంగల ఆటలను సాగనివ్వకూడదని తీవ్రప్రచారం చేశాం. ఇదంతా బ్రిటిషు ప్రభుత్వానికి మద్దతివ్వడమేనా?

రాయలసీమలో కరువు రాగానే-నివారణోద్యమం ప్రారంభించాం. కృష్ణాగుంటూరుజిల్లా నుంచి 26 మంది వాలంటీర్లను పంపించాం. ఇల్లిల్లుతిరిగి డబ్బు, ధాన్యం, బట్ట పోగుచేసి అక్కడిప్రజలకుపంపించాం. ఇప్పుడు మమ్మల్ని ఆడిపోస్తున్నవారంతా అప్పుడేం చేశారు? రాయలసీమకు సహాయం చేయడంకూడా బ్రిటిషుప్రభుత్వానికి మద్దతివ్వడమేనా?

బెంగాలు సహాయానికి ఆంధ్రలో వేయి గ్రామాల్లో 10,000 రూపాయిలు పోగుచేసి పంపించాం. ఇది ప్రభుత్వానికి సహాయం చేయడమా- లేక ప్రజల్లో అణగిమణగిఉన్న శక్తిని, దేశభక్తిని రగుల్కొలిపి, దానిని సద్వినియోగం చేయడమా? ప్రజల్లో ఇంత భక్తి ఉందన్న సంగతి ఈ కాంగ్రెసువాదులకు తెలియదు.

గాంధీజీ చేయదలచిందే పార్టీ చేస్తూంది

గాంధీజీజాబులను మరోసారి జ్ఞప్తికితెచ్చుకోండని కోరుతున్నాను. తాను బయటికివచ్చి ప్రజలకు సహాయం చేయడంకోసం గాంధీజీ ఎంతోతహతహ వెలిబుచ్చారు. ఆ ఉద్దేశంతో రాజకీయ సమస్యా పరిష్కారంకోసం రాయబారాలు జరపాలని కోరారు. ఏపని చేయడంకోసం మహాత్మాగాంధీ అంత తహతహలాడారో ఆపనినే కమ్యూనిస్టుపార్టీ తన సర్వశక్తులను వినియోగించి, కొనసాగిస్తూంది.

గాంధీజీ జైల్లో ఉండడంవల్ల మాట్లాడలేకపోతున్నాడు. కని శ్రీమతి సరోజినినాయుడు బయటవుంది. ఆమె సందేశం ఇచ్చింది — కరువు నివారణకోసం అంతా ఏకం కావాలని. ఈ ఐక్యతకోసమే కమ్యూనిస్టుపార్టీ కృషి చేస్తూంది. హైద్రాబాదులో మేముచేస్తున్న పనిని సరోజినీదేవి స్వయంగాచూచింది. ఆ కృషికి తోడ్పడమని తన కుమార్తెను పంపింది. మేము ప్రభుత్వానికి మద్దతు నిస్తున్నామంటున్నారు ఇక్కడి కాంగ్రెసువాదులు, సరోజినీదేవి ఆశీర్వాదం పొందడానికి మేము తగుదుము కాని, ఈ కాంగ్రెసువాదుల సహకారానికి మాకు అర్హత లేకపోయిందట!

తమ్ముని లాంటిది

కాంగ్రెసుకోసం - ఆ మహాసంస్థ ప్రతిష్ఠను కాపాడడంకోసం ఈ కాంగ్రెసువాదులకన్నా మేము ఎక్కువదీక్షతో పోరాటం సాగించాం. అనేకమంది కాంగ్రెసువాదులు మాకృషినిచూచారు - మీ అందరిలాగానే గర్వపడ్డారు. ఇంతకూ కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెసు మహాసంస్థకు తమ్ముడులాంటిది. కాని, ఈకొద్దిపాటి విషయాన్ని కాంగ్రెసువాదులు ఎందుకు గుర్తించడంలేదు? ఒకవైపు తాము కాంగ్రెసుకి అపార్థాలు కల్పిస్తున్నారని, కాంగ్రెసు విధానానికి విరుద్ధంగా పోతున్నారనీ వీరు గుర్తించాలి. మరోవైపు కమ్యూనిస్టు పార్టీ ఆ మహాసంస్థ సంప్రదాయాలను చెక్కుచెదరనీయకుండా కాపాడుతూందన్న సంగతిని గుర్తించాలి.

ఉభయులకూ తలిదండ్రులయిన మీరు—

ఇంతవరకు జరుపుతూవచ్చిన కృషిని ఇకమీదటకూడా మేము కొనసాగిస్తాం. కాని, చేయవలసిందంతా మేమొక్కరమే చేయలేము. సహాయంకోసం, తమ్మునిలాగా కాంగ్రెసువాదులకు చేయి చాచాము — వారు తోడ్పడ నిరాకరిస్తున్నారు.

మాకూ, వారికీ — మీరే — ప్రజలే తలిదండ్రులు. వారు మాచేతి నందుకొనేలా, మాకు తోడ్పడేలా మీరుచేయాలి—మీరే చేయగలరు. మీ కొమారులు, కొమార్తెలు అయిన మేము చేస్తున్న కృషికి మీరు సంతోషిస్తున్నట్లయితే మాఅన్నలు మావిజ్ఞప్తిని, దేశభక్తితోచేస్తున్న విజ్ఞప్తిని, ఆలించేలా చేయాలి.

రాయలసీమ కరువు నివారణ

రాయలసీమ కరువును గురించి మహాసభలో ఈదిగువ తీర్మానం జరిగింది

"తగినన్ని నీటిపారుదల (ఇరిగేషన్) వసతులు లేకపోవడంవల్ల, వర్షాలు సరిగా కురియనందువల్ల, రాయలసీమలో కరువు వ్యాపించింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల లాంటి శాశ్వత కరువు నివారణ కార్యాలకు పూనుకొంటే తప్ప, మాటిమాటికీ సంభవించే ఈ కరువును సరిగా నివారించలేము. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం, కరువుచట్టము ననుసరించి రోడ్లువేయించుటద్వారా ప్రజలకు పని కల్పించుతోంది. కరువు తిరిగి తలయెత్తకుండా ఉండాలంటే ఈపనిచాలదు. అనంతపూర్, కర్నూలు, బళ్ళారి జిల్లాలలో గత సంవత్సరం, కరువుతోపాటు, ఆహారవస్తువులు దొరకకుండా పోయాయి. రాష్ట్రప్రభుత్వం 60 క్షామనివారణ క్యాంపులను పెట్టి 4 లక్షల కార్మికులకు పని గల్పించింది. అనంతపూర్‌లో 2¼ కోట్ల రూపాయలు, రాయలసీమలోని ఇతర జిల్లాలలో 6 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. ఈ డబ్బునే గనుక మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించడానికి ఖర్చు పెట్టినట్లయితే, రాయలసీమను రక్షించడమేగాక, మున్ముందు కరువులుకూడా రాకుండా వుండేందుకు ఉపయోగపడేది.

ఈ సంవత్సరంకూడా తగినంత వర్షం లేకపోవడంవల్ల అనంతపూర్, బళ్ళారి జిల్లాలలో పంటలు పండలేదు. అందుచే మరింత తీవ్రమైన కరువుకు దారి తీసింది. తిరిగి ఫ్యామిన్ క్యాంపులన్నీ తెరువవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

అందుచే అఖిలభారత కిసాన్ మహాసభ, క్షామనివారణ కార్యాలక్రింద మైనర్ - మేజర్ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతోంది. అలా పూనుకొంటే రైతు కరువును దాటగల్గుటేగాక, మున్ముందు ఆహారాన్ని అధికంగా పండించేందుకు అతడుసంసిద్ధుడవగలడు. ఎట్టి కాలవిలంబనం లేకుండా ఈక్రింది ప్రాజెక్టులను నిర్మించాలని కిసాన్‌సభ ప్రభుత్వాన్ని కోరుతోంది.

అనంతపూర్‌జిల్లాలో:

(1) అప్పర్‌పెన్నార్ (2) పెన్నార్-కుముద్వతి (3) పేరూరు (4) భైరవానితిప్ప (5) ఈదోడి.

బళ్ళారిజిల్లాలో: తుంగభద్ర

కర్నూలుజిల్లాలో: సంగమేశ్వరం

కడపజిల్లాలో: గండికోట

ఈ పైప్రాజెక్టుల కోసం రాయలసీమ రైతులు నిరంతర ఆందోళనచేయాలనీ, బలిష్ఠమైన రైతువుద్యమాన్ని నిర్మించాలనీ, బలిష్ఠమైన రైతువుద్యమం ఒక్కటే పైకోర్కెలను సాధించగలదనీ, కిసాన్‌సభ హెచ్చరింపుతోంది.

మన ప్రాచీన కళారూపాలలో దేశభక్తిని ప్రబోధించేవిషయాల్ని చొప్పించాలి

ఇసుకవేసినా రాలని జనం, చీమ చిటుక్కు మనడంలేదు. చల్లని పిల్లగాలి ప్రేక్షకుల్ని జోకొడుతోంది. చీకటి తెరలను చీల్చుకొంటూ చంద్రుడు త్వరపడుతున్నాడు మన వైజ్ఞానిక ప్రదర్శనాలను ఎప్పుడు చూద్దామా అని. ప్రజలూ అంతే. దూరప్రయాణంచేసిన బడలిక వాళ్ళ ముఖాల్లోలేదు. ఊరేగింపులు, ప్రదర్శనాలు, ఉపన్యాసాలు, జనుల కోలాహలం, మూలంగా బుర్రవేడెక్కినట్లు వారిలో కన్పించలేదు. ఏవోచూడాలని, ఏమో వినాలని కుతూహలం, ఆతృత, ఆనందం ఆ లక్షమంది ప్రజల్లోనూ కన్పించుతోంది.

"ఎగురవేయి భారతభువిపై" అంటూ జండాపాట పాడారు. కోటిగొంతులు కలిపి తమ రైతాంగ జండాకు జయధ్వానాలు చేస్తున్నట్లు అనిపించింది ఆసమిష్టిగానం. ప్రమత్తులైయున్న భారతప్రజలను మేల్కొల్పుతూ 'జాగ్‌రే' అంటూ బొంబాయి వైజ్ఞానికదళం ఒకపాట పాడింది. వసంతకాలా నంతరం వచ్చే పంటను భద్రపరచుకోమని రైతును హెచ్చరించుతూ యు. పి. వైజ్ఞానికదళం ఒక పాటపాడింది. బెంగాల్ దళం ఎర్రజండా పాటను సమిష్టిగా పాడింది.

హర్షధ్వనుల మధ్య జోషీ వేదికనెక్కాడు. ప్రాచ్యకళాస్వరూపాలను తీసుకొని, వాటికి కొత్తకొత్త భావనాపుష్టినిచ్చి, కమ్యూనిస్టులు పారంపర్యంగా వస్తున్న మన కళలను, విజ్ఞానాన్ని ఎలా నిలబెడుతున్నారో సంగ్రహంగా చెప్పాడు. తర్వాత జోషీ కమ్యూనిస్టుపార్టీ పంథా వివరించాడు. దీని తర్వాత వైజ్ఞానిక ప్రదర్శనాలు ప్రారంభమయ్యాయి.

"అల్లాకేనాం - హల్లాకేనాం" అంటూ ఇద్దరు పకీరులు వేదికపై కెక్కారు. ప్రస్తుతం దేశంలోని కరువు ప్రతిష్ఠంభనలను వివరించిన తర్వాత "హిందూ - ముస్లిం ఏక్‌హో" అంటూపకీరులు నిష్క్రమించారు. "హిందూ-ముస్లిం ఏక్‌హో" అంటూ ప్రేక్షకులు తిరిగి జవాబిచ్చారు. ఐక్యతకై ప్రజలెంత తహతహపడుతున్నారో ఈ నినాదం ఒక్కటే తెల్పింది. తర్వాత నెమిలిపింఛాలతో చెంచువాళ్లు తయారు. రైతుకర్తవ్యాన్ని ప్రబోధించుతూ చెంచీతపాటపాడారు. ఈ రెండు అంశాలలోను వేషం, భాష, బహుచక్కగావుంది. తమ దైనందిన జీవిత సమస్యలను ఇంత చక్కగా, ఇంతతేలికగా, ఇంత సూటిగా రైతుపుత్రులు, కూలిబిడ్డలుప్రదర్శించుతూంటే ప్రేక్షకులు పొందిన ఆనందాన్ని వర్ణించడానికి వీలులేదు. ఇంతలో బొంబాయి దళంవేదికఎక్కింది. బెంగాల్‌కరువునుగురించి "పోవ్‌డా" (మనబుర్రకథలాంటిది) పాడారు. భాష అర్థంకాడంలేదు. కాని భావం అర్థం అవుతూనేవుంది. బెంగాల్ కరువు అనగానే పగలు చూచిన బెంగాల్ కరువు దృశ్యాలు జ్ఞప్తికి వచ్చాయి. ఇందాకటినుండి ఉరకలు వేడుతున్న సంతోషంయిప్పుడులేదు. ఆలోచలోన పడ్డారు, తలలూపారు. ఏంచెయ్యాలి? ఏమనుకొంటున్నారో తెలియదు. "మానొక్క పొలిమేరలోన" అన్నకోలాటంపాట మళ్లా ఈ ప్రపంచంలోకి రప్పించింది ప్రజల్ని. ఫాసిస్టు రాక్షసులనుండి ప్రపంచాన్ని కాపాడుతున్న రెడ్‌ఆర్మీ విజయాలను ఇంత ప్రతిభావంతంగా చిత్రించినకవిగాని, ప్రదర్శించిన ప్రదర్శకులుగాని ఇదివరకెన్నడూలేరు.

లక్షలకొలది ప్రాణాలర్పించిన రెడ్‌ఆర్మీ చరిత్రలో ఒక మహత్తర బాధ్యతను నిర్వర్తించింది. కాని యుద్ధంలో పాల్గొనకుండానే మనబెంగాలులో 50 లక్షలమంది తిండికోసం మలమలమాడి చనిపోవడమా?—అని ఆలోచనలోపడివున్న ప్రేక్షకులకు బెంగాలుదళం "మృత్యునృత్యం" ప్రదర్శించింది.

కరువువాతపడ్డ బెంగాలు రైతు కుటుంబం అది. భార్యాభర్తలువారు. "ఆకలి! ఆకలి!!" అంటూ యాచనకు బయలుదేరుతారు. ఒక్క రాగిడబ్బు దొరికేసరికే పట్టరాని సంతోషం వస్తుంది. ఆనందంతో పిచ్చిఎత్తిపోతారు. కాని ఆ రాగిడబ్బులకు తిండిదొంగ బియ్యం ఈయడు. తనుదాచిన బస్తాలను, తనకొచ్చే లాభాలను లెక్కపెట్టుకొంటాడు. అంతే. ఆకలివాతబడి భర్త మరణిస్తాడు. మృత్యువు వస్తుంది. భార్య మృత్యువుతో పోరాడుతుంది. కాని చివరకు ఆమెకూడా బలికాకతప్పలేదు. ఈ నృత్యంలో పాల్గొన్న పానూపాల్, ఉషాదేవి అత్యద్భుతంగా నటించారు. ఆకలి బాధ, డబ్బులు దానంచేసినప్పుడు సంతోషంతో పిచ్చెత్తిపోవడం, తిండిదొంగ బియ్యం ఈయ నిరాకరించినప్పుడు దైన్యం, మృత్యువుతో పోరాడేటప్పుడు ఘర్షణ, — ఈ భావాలన్నీ అద్భుతంగా ప్రదర్శించారు. బెంగాల్ క్షామచిత్రాన్ని ఇంకెన్నడూ మరువనట్లుగా హృదయాలకు హత్తుకొనేటట్లు చేశారు. బెంగాల్ క్షామ నివారణకు వెంటనే గలగలమని డబ్బులు రావడమే ఇది ప్రజలకెంత నచ్చిందో తెలియజేస్తుంది. తక్కిన కార్యక్రమానికి భంగం రాకుండేందుకుగాను, ఆ విరాళాలను తీసికోడాన్ని ఆపివేయవలసి వచ్చిందికూడా.

తర్వాత ఆంధ్రదళం బెంగాల్ కరువుపైన ఒకపాటా, కష్టజీవి బుర్రకథా చెప్పింది. జమీందారీ విధానంక్రింద రైతులుపడే అవస్థ లనుగురించిన కథ అది. జమీందారీ రైతుల కష్టాలువిన్న ప్రేక్షకులకు, తేయాకుతోటల్లోని కార్మికుల కష్టాలను బెంగాల్‌దళం నృత్యం ద్వారా, పాటద్వారా చూపించింది.

మొదటిరోజు (14 వ తేదీ) వైజ్ఞానిక ప్రదర్శనా లీ విధంగా ముగిశాయి.

రెండవరోజు కార్యక్రమంలో బెంగాలు, బొంబాయి, కేరళ, తమిళనాడు, పంజాబు దళాలు పాల్గొన్నాయి. మొత్తంమీద 17 అంశాలను ప్రదర్శించారు. లాఠీలకు, జైళ్లకు, ప్రవాసాలకు గురియైన పంజాబు వృద్ధ సింహాలు మొదలుకొని, బాలసంఘాలవరకు ఇందులో పాల్గొన్నారు.

మొదట తమిళనాడుదళం బాలసంఘం పాట (బెంగాలు కరువుమీద) పాడింది. తర్వాత ఉర్దూ మహాకవి, కార్మికనాయకుడూ అయిన మక్దుంవ్రాసిన "జంగ్ హై జంగ్ ఆజాదీ" ప్రేక్షకుల నుర్రూతలూగించింది. మక్దుం ఆంధ్రుడని తెలియగానే మరింత ఉప్పొంగిపోయారు. రైతుల గమ్యస్థానాన్ని తెలియజేస్తూ పాడిన పడవపాటకు ఒళ్లుమరచిపోయారు చూచేవారంతా.

మళ్లా బెంగాల్ దళం నృత్యం చేసింది. "గంభీరనృత్యం" అని దానికిపేరు. 1943 లో బెంగాల్‌కరువును చిత్రిస్తూ హిందూ-ముస్లిం సోదరులిద్దరు తమదీనగాథచెబుతారు. భార్యని, పిల్లల్ని అమ్ముకోడం, తినకతినక ఎన్నాళ్లకో తింపితినడంవల్ల జీర్ణించుకోలేక కలరారావడం, డాక్టర్లు లాభంలేదని చెప్పడం, కుటుంబాలు విచ్ఛిన్నమవడం — ఈ విషాదగాథనంతా నృత్యంద్వారా చెప్పారు. హృదయాలను దూసుకుపోయే ఆ నృత్యంచూచాక, పాటకు అర్థమే తెలిసివుంటే, ఇంకెంతగా బెంగాల్‌చిత్రం మనస్సుకు నాటుకుపోయేదో ననిపించింది.

తర్వాత పంజాబు వృద్ధసింహాలు లేచాయి. పదాడంబరంలేకుండా, సూటిగా అర్థమయ్యే శైలిలో ప్రశ్నోత్తరాల రూపంలో ఒకపాట పాడారు. భాషతెలియకపోయినా, పాడేవారిని, వారికి వంతకలిపేవారిని చూడగానే భావం అరచేతిలో ఒలిచిపెట్టినట్లనిపించింది.

పిమ్మట మలబారు దళం ఒట్టంతుళ్ళల్ (మన భరతనాట్యంలాంటిది) నృత్యం గావించింది. దక్షిణాదిలో మన కూచిపూడి భరతనాట్యం, కేరళలో కథాకళి మొదలైనవి అఖిలభారత ప్రశస్తిగన్న ప్రాచీన కళాస్వరూపాలు. కేరళదళం ఆనృత్యంలో ఎర్రజండా పాట, భారత రైతాంగ జీవితాన్ని వర్ణించింది. మంచి హంగూ, ఆయాసం రాకుండా కొద్ది భాగము మాత్రం ప్రదర్శించివుంటే ఎంతో బాగుండేది.

మరాఠీలో ఐక్యతమీద బొంబాయి దళం ఒక ఉత్తేజకరమైన గీతాన్ని పాడింది. కాంగ్రెసు - లీగ్ - ఎర్రజండాలను కలుపుతూ పాడినప్పుడల్లా హర్షధ్వానాలులేచాయి.

తక్కిన ప్రదర్శనాలలో ఆంధ్రదళంవారి వీధిభాగవతం, లంబాడీడ్యాన్సు, భజన అమితంగా ఆకర్షించాయి. వీధిభాగవతంలోహిట్లరు కోతలు - అరపులు, ముసోలినీ టోజోల ఏడ్పులూ, మరపురానివి. లంబాడీ డ్యాన్సును బాలికలైనా ఎంతో ప్రతిభావంతంగా ప్రదర్శించారు. గుజరాతి గర్భనృత్యాన్ని జ్ఞప్తికి తెస్తోందన్నాడు ఒక బొంబాయి ప్రతినిధి. మహిళలు బుర్రకథ చెప్పడం వింతగాకన్పించింది మహిళాలోకానికి.

తమిళరాష్ట్ర దళంలో భక్తి పారవశ్యంతో చిందులువేసిన కుంటివాడు మద్రాసు కమ్యూనిస్టు కుట్రకేసులో ప్రముఖుడైన రామమూర్తి అనీ; కేరళ నృత్యానికి హంగుదారులలో మద్రాసు కమ్యూనిస్టు కుట్రకేసులోని కేరళీయన్ ఉన్నాడనీ తెలియజెప్పగానే ప్రజలంతా విస్తుపోయారు.

ఆఖరున ఒక్కమాట చెప్పాలి. బినయ రాయ్ (బెంగాల్) రచించిన "మైభూఖాహూఁ" (ఆకలి) అనేనాటకం అత్యద్భుతంగా ప్రదర్శించబడింది. కరువు రాక్షసిపాలిటబడ్డ ఒక రైతు, ఒకకూలీ, ఒక చిన్నవర్తకుడు, ఒకస్త్రీ, పడేబాధలను ఇందులో వర్ణించారు. ఆకలితో చావనున్న వారికి ఒకభక్తుడు విదల్చిన నాల్గు రాగిడబ్బులకే వాళ్లెంతో సంతోషంతో పిచ్చివాళ్లయి పోతారు. కాని తిండిదొంగవాళ్లకు బియ్యం అమ్మడు. నిస్సహాయస్థితిలో నున్న వాళ్లను, పంచముంగ దళంవాడు లూటీలకు పురికొల్పుతాడు. లూటీవల్ల అన్నం దొరకలేదుసరిగదా లాఠీలు, తుపాకిగుళ్లు లభించాయి. కరువును ఆధారంచేసుకొని స్త్రీల శీలాన్ని అపహరించే తుచ్ఛుపొకడు వస్తాడు. తనబిడ్డ ప్రాణం నిలబెట్టుకోడానికి ఒకరాత్రి ఆ స్త్రీ తన మానాన్ని అమ్ముకొంది. కానిబిడ్డ ప్రాణం పోయింది. తన మానమూ పోయింది. ఆ తుచ్ఛునిచూడగానే ఆమె కంపించిపోతుంది. ఇక్కడ ఉండవద్దు పొమ్మని బ్రతిమాలుతుంది. మరొక అనాథ స్త్రీ వెంటబడి ఆ తుచ్ఛుడు పోతాడు. తర్వాత జపాను బాంబుల బాధలకు గురియౌతారు. చావగా మిగిలినవారు మహిళా ఆత్మరక్షణ సమితి సహాయాన్ని పొందుతారు. ఈనాటిక చూచిన తర్వాత రాతిగుండెకూడా కరిగిపోతుంది. ఈ నాటికలో ఉషాదేవి అభినయ చాతుర్యాన్ని ప్రశంసించని వ్యక్తిలేదు.

ఈ వైజ్ఞానిక కార్యక్రమంవల్ల ప్రజలు పొందింది వట్టి వినోదాన్ని మాత్రమేకాదు. ప్రతి అంశంలోను ప్రదర్శనలతోపాటు ప్రేక్షకుల హృదయ తంత్రులు స్పందించాయి. ఎర్రజండాకు సగర్వంగా హర్షధ్వానాలు చేశారు. హిట్లర్ సరాభవానికి కడుపుబ్బ నవ్వారు. రెడ్‌ఆర్మీ విజయాలకు కృతజ్ఞతాపూర్వకంగా జోహారులు చేశారు. బెంగాల్ కరువు నృత్యాలు - నాటికలు చూచినప్పుడు కంటతడిపెట్టారు.

వైజ్ఞానిక కార్యక్రమం ప్రజలలో గాఢమైన దేశభక్తిని రేకెత్తించడానికి ఉద్దేశించబడింది. ఆంధ్రదేశంలో దేశభక్తి సందేశమివ్వడానికి వైజ్ఞానిక ప్రదర్శనాలు ఎలా ఉపయోగించుతున్నాయో ఇతర రాష్ట్ర ప్రతినిధులు దీనివల్ల తెలిసికొన్నారు. అలాగే ఇతరరాష్ట్ర ప్రదర్శనాలవల్ల మనరాష్ట్ర ప్రజలు ఎన్నోవిషయాలు నేర్చుకొన్నారు. ముఖ్యంగా బెంగాల్‌క్షామచిత్రం ఇదివరకు ఇంతస్పష్టంగా మన ప్రజల కనులకు కన్పట్టలేదు.

బెజవాడ వార్‌టెక్నిషియన్సు రైతాంగంతో తమ కార్మిక ఐక్యతను తెలియజేయడానికిగాను ఒక కప్పును బహూకరించారు. వైజ్ఞానిక ప్రదర్శన దళాలలో ఉత్తమ దళానికి ఇది ఈయమని కోరారు. కొన్ని సామాన్య లోపాలున్నా, మన ప్రజలలో గాఢంగా చొచ్చుకొనిపోయి ఉన్న ప్రాచ్యకళాస్వరూపాలను ఏరి చక్కగా ప్రదర్శించినందున ఆంధ్రదళానికి ఈబహుమానం వచ్చింది. దువ్వూరు బలరామిరెడ్డిగారిచ్చిన మరొకకప్పు వైజ్ఞానిక దళాలను బాగా తర్ఫీదుచేసిన రైతుసంఘానికిగాను ఉద్దేశించబడింది. అది ఆంధ్రరాష్ట్ర రైతుసంఘానికి వచ్చింది. ఆహ్వానసంఘంకొన్నిప్రత్యేకబహుమతులను ఇచ్చింది. ప్రదర్శనాలలో బాగా నటించిన కామ్రేడ్ ఉషా (మొదటిబహుమానం) కామ్రేడ్ పున్నయ్య, కామ్రేడ్ రాజారావు ఈ బహుమతులను పొందారు. ఇతర బహుమతులలో బెంగాల్‌దళానికి 1000 రూపాయలు, బెంగాలు క్షామనివారణకుగాను ఈయబడింది. అమృతలూరు బాలసంఘానికి, మంచికలపూడి భజన సమాజానికి, గుంటూరు మహిళాదళానికి, బెంగాల్ మలబారు బొంబాయి దళాలకు ఇంకాకొన్ని ప్రత్యేక బహుమతులు ఈయబడినాయి.

★ అఖిలభారత రైతుమహాసభ

చరిత్రాత్మక దృశ్యాలు

ప్రతి 8 వ తేదీ. స్టేషనుకు వెళ్దామని బయలుదేరాను. బిసెంటురోడ్డుమధ్యకు చేరాను. సింహగర్జనల్లాగా నినాదాలధ్వని వినిపిస్తు వుంది. ఉలిక్కిపడి అటువైపు చూశాను. ఎర్రగుడ్డమీద తెల్లటి పెద్ద అక్షరాలతో 'పంజాబ్ కిసాన్‌సభ ప్రతినిధులు' అని ఇంగ్లీషులో వ్రాయబడ్డ ఒక బేనరును యిద్దరు వ్యక్తులు పట్టుకుని ముందు నిల్చున్నారు. ఒక ఆయన పండు వృద్ధు, తెల్లగా మూరెడుగడ్డం. ఆగడ్డం ముఖానికి ఎంతో వర్చస్సు చేకూర్చుస్తూంది. ఆయన ఒక సిక్కుయోధుడు. రెండో వ్యక్తివైపు చూశాను. ఆకారాన్నిబట్టి ముస్లిం అని పోల్చాను. ఏమి ఐక్యత! అని నాలోనేను అనుకున్నాను. ఇద్దరిద్దరు బారులుగా నిలబడి 60, 70 మంది మార్చి చేసుకుంటూ వస్తున్నారు. వాళ్ళచేతుల్లో ఉన్న ఎర్ర జండాలు గాలితోచెలగాటలాడుతున్నాయి. పంజాబీభాషలో కిసాన్‌గీతం పాడుతున్నారువారు. వారిలో వృద్ధులు, నడిమివయస్కులు, యువకులు వున్నారు. రోడ్డుకు యిటుపక్క అటుపక్కవున్న ప్రజలకళ్ళు వారిమీదే వాలివున్నాయి. నేను వాళ్ళ వెనకాల నిలబడ్డాను. కొద్దిసేపయినతర్వాత ఒక ఆయన అంటున్నాడు-లేదు-చిన్న ఉపన్యాసం యిస్తున్నాడు- "నాయకులంటే వాళ్ళురా! ప్రజలతో ఎంత సన్నిహిత సంబంధం! మనం ఎప్పుడైనా చూశామా యిల్లానాయకులు, ముఖ్యంగా వృద్ధులు జండాలు చేత పట్టుకొని పాటలు పాడుతూ, నినాదాలుయిస్తూ రోడ్లమీద మార్చి చేస్తూ రావడం!" అని.

మరునాటికల్లా వివిధప్రాంతాలనుంచి డెలిగేట్లు, ప్రేక్షకులు వారి వారి ప్రాంతీయ భాషల్లో జాతీయగీతాలు, రైతుగీతాలు, పాడుకుంటూ బెజవాడ అఖిలభారత కిసాన్ మహాసభకు వచ్చి చేరుకున్నారు. మొత్తం అన్ని ప్రాంతాలనుంచి 500 మంది డెలిగేట్లు. ప్రేక్షకులు మహాసభకు వచ్చారు.

డెలిగేట్ల బసలో

మొదట పంజాబు డెలిగేట్లవద్దకు వెళ్లాను. "బాబా సోహన్‌సింగ్ భాక్నా వచ్చారా?" అని ప్రశ్నించాను. ఒక సిక్కు డెలిగేట్ "ఆయన రాలేదు; ఆరోగ్యం సరిగా లేనందున ప్రయాణం చేయలేకపోయారు" అని జవాబిచ్చారు. ముఖంలో చిరునవ్వు తొణికిసలాడుతూ, ఎర్రగా ఆజానుబాహువుగా ఉన్న ఒక ముసలి ఆయనవైపు నాదృష్టి మరలింది. ఆయన ఎవరని అడిగాను. "ఈయనే నిధాన్ సింగు" అన్నారు. కామ్రేడ్ నిధాన్‌సింగు 1924 కి ముందు వ్యాపారం కోసం అమెరికా వెళ్ళారు. కొన్నిలక్షల రూపాయలు సంపాదించారు. మొదటి సామ్రాజ్యవాద యుద్ధంలో (1914—18) ఈయనలాగే పంజాబునుంచి అమెరికాకు వెళ్ళిన అనేకమంది సిక్కులు గదర్‌పార్టీని నిర్మించారు. భారతస్వాతంత్ర్యం కొరకు విదేశాలలో స్థాపించబడ్డ మొదటి విప్లవపార్టీ యిదే. ఈ పార్టీని స్థాపించిన మూలపురుషులలో ఈయన ఒకరు. ఆర్జించిన లక్షలాది ధనం విప్లవోద్యమానికి వినియోగించారు. ఈ సందర్భంలోనే వీరు ఇండియాకు రావడం, కలకత్తాలోదిగీదిగడంతోనే ప్రభుత్వ సైనికులతో పోరాడటం జరిగింది. ఆ పోరాటంలో అనేకమంది ప్రాణాలు విడిచారు. కొంతమంది పట్టుబడ్డారు. ఈయన మాత్రం తప్పించుకొని వెళ్ళిపోయాడు. అప్పటినుంచి 1935 వరకూ అమెరికాలో ఉన్నాడు. అమెరికాలో మార్క్సిజాన్ని గురించి చదవడం, సోవియట్ రష్యావైపు ఆకర్షించబడటం జరిగింది. 1935 నుంచి 43 వరకూ సోవియట్ యూనియన్‌లో నివసించాడు. మాస్కోయందలి తూర్పుదేశాల విశ్వవిద్యాలయంలో తరిఫీదు పొందాడు. మధ్య తూర్పుదేశాల్నీ వనదేశాన్నీ, నాజీమూకలబారినుండి కాపాడి ప్రపంచప్రజల కృతజ్ఞతను బడసిన స్టాలిన్‌గ్రాడ్ వీరయోధుల్ని చూచివచ్చాడు.

ఇలాగే షుమారు 25 మంది సిక్కుయోధులు, ద్వీపాంతరవాస శిక్షలనుభవించినవారు ప్రతినిధులుగా వచ్చారు.

సర్దార్ పృథ్వీసింగ్

సర్దార్ పృథ్వీసింగ్‌ని దర్శించాను. "మీరు చాలా ముసలివారైపోయి యుంటారనుకున్నాను. కాని, అలా లేరే!" అని నేననగా, ఆయన "మనం మన ఆదర్శంకోసం యింకా పోరాటాలు చేయవలసియుండగా, ముసలివాణ్ణి గావటానికి అవకాశం యెలా ఉంటుంది?" అని జవాబిచ్చారు. మన ఆంధ్రరాష్ట్రంలో స్వాతంత్ర్యోద్యమం వ్యాపించిన ప్రతిమూల పృథ్వీసింగు పేరెరుగనివారు లేరు. 20 సంవత్సరాల క్రితం రాజమండ్రి జైలులో వందలాది కాంగ్రెసు రాజకీయఖైదీలతో కలసి యున్నాడు. ఈయనకు మొదటి లాహోరు కుట్రకేసులో యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష విధించబడింది. చేతులకూ, కాళ్లకూ యినప సంకెళ్ళు వేసి, మెయిలులో తీసుకెళ్తుంటే, చీరాల, ఒంగోలు ప్రాంతంలో బయటికి దూకి తప్పించుకున్నాడు. 1939 లో గాంధీజీ సలహాపై ప్రభుత్వానికి పట్టుబడడం, కొద్దినెలలు జైలులో ఉన్నతరువాత, విడుదల చేయబడ్డం జరిగింది. తిరిగి 1942 ఆగస్టు ఘటనల సందర్భంలో డిటెన్యూగా పట్టుకోబడి, మొన్న ఫిబ్రవరి 26 వ తేదీని విడుదలచేయబడ్డాడు.



మా విలేఖరి

ఈవిధంగా అన్నిక్యాంపులలో కాంగ్రెసు, టెర్రరిస్టు కిసాన్-కమ్యూనిస్టు ఉద్యమాలలో పాల్గొని, విశేషఅనుభవం సంపాదించిన వివిధ ప్రాంతాల దేశభక్తుల్ని చూచాను. బెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడ్, విదర్భ రాష్ట్రాల నుంచి స్త్రీ ప్రతినిధులు, ప్రేక్షకులు, వచ్చారు.

రైతు నగర్

16 యకరాల ఆవరణలో "రైతునగర్" నిర్మించబడింది. మధ్య తాటిచెట్టుమీద ఎర్ర జండా యెగురుతోంది. ఉత్తరాన ఎత్తైన కొండలు, తూర్పున మామిడితోపు, దక్షిణాన బ్రంకురోడ్డు, పడమట బెజవాడ పట్టణం.

ప్రధానద్వారం "కొమ్మారెడ్డిగేటు". దాని మీద మధ్యలో సుత్తే-కొడవలి చిహ్నం. రెండువైపులా రైతు స్త్రీ పురుషుల చిత్రాలు ఉన్నాయి.

"దేశరక్షణకొరకు, ప్రజాపోషణకొరకు, అధికపంటలు పండించండి!" అని పెద్ద అక్షరాలతో చిత్రించబడిన నినాదం రైతుల ప్రధాన కర్తవ్యాన్ని సూచిస్తూంది. మొత్తము మీద ఈ గేటు చూపరులమనస్సును రంజింపజేసింది. ఆంధ్రరాష్ట్ర రైతువుద్యమాన్ని నిర్మించినవారిలో ముఖ్యుడై, కాలినడకను ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు రైతుయాత్రను నడిపిన కిసాన్ యోధుడు కీర్తిశేషుడైన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిని ఆంధ్రరైతాంగం ఈవిధంగా గౌరవించుకుంది. ఉత్తరాన కయ్యూరు కామ్రేడ్స్ గేటు. మలబారు రైతువుద్యమంలో పనిచేసి సామ్రాజ్యవాదుల దౌర్జన్యానికి ఎరయైన నలుగురు కయ్యూరు వీరయోధుల స్మృతిచిహ్నంగాను, వివిధ జాతులమధ్య సామరస్యం తెలుపుతూను వుంది ఈగేటు. తూర్పున పెనుమెత్స సూర్యనారాయణ గేటు. ఈయన కాంగ్రెసు, కిసాన్, కమ్యూనిస్టు వుద్యమాలలో పాల్గొన్నాడు. ఎన్నోసార్లు కారాగారశిక్ష అనుభవించేడు. తూర్పుగోదావరిజిల్లా రైతుసంఘ కార్యదర్శిగా పనిచేసేడు. మార్చి 6వతేదీని క్షయవ్యాధి ఈయనను పొట్టబెట్టుకుంది.

ప్రజాసంరంభం

మహాసభకు క్రితంరోజు పట్టణమంతా కోలాహలంగావుంది. ఎక్కడ చూసినా జనసమూహమే. 100 మైళ్ళదూరమునుంచికూడ రైతులు, కూలీలు, యువకులు, కాలినడకను ప్రయాణంచేసి సభకువచ్చేరు. పడవలమీద ప్రయాణంచేసి వచ్చినవారు అనేకులు రైతునగరం ముందువున్న కాలువవద్దదిగి, బారులు బారులుగా, క్రమశిక్షణతో, పాటలుపాడుకుంటూ, నినాదాలుయిస్తూ, నగర్‌లో ప్రవేశించడం చూడ ముచ్చటగావుంది. సైకిళ్ళమీద వచ్చినవారు వందలాది. ఆ రాత్రంతా రైలు స్టేషనునుంచి వూళ్లోగుండా 'మార్చి' చేస్తూ, 'అఖిలభారత రైతుమహాసభకు జై' అని కేకలువేస్తూ వచ్చేవాలంటీర్లకు అంతులేదేమో ననిపించింది. ఇక రైతు ప్రజాసామాన్యం మాట వేరే చెప్పాలా! నలువైపులనుంచి పట్టణంలోకి వచ్చేరస్తాలన్నీ రెండెడ్లబళ్ళతో నిండిపోయాయి. ఆబళ్ళు ఎర్రజండాలతోటి, రైతునాయకుల చిత్రాలతోటి, నినాదాలు వ్రాయబడ్డ 'అట్టల' తోటి, అలంకరించబడి వున్నాయి. రైతులు తమ కుటుంబాలతోసహా వంటసామగ్రిని తెచ్చుకొని, తమ ప్రియమైన రైతుసంఘ సమావేశానికి తరలివచ్చేరు. పక్కనేవున్న మామిడితోపులోను, ముందు ఆవరణలోను, ఎక్కడచూసినా బళ్ళే. వూళ్లో ఉన్న యిళ్ళన్నీ సమావేశానికి వచ్చిన బంధువులతోను, స్నేహితులతోను, కిటకిటలాడుతూన్నాయి 1920 సహాయ నిరాకరణోద్యమపు రోజుల్లోమహాత్మాగాంధి, షౌకతాలీ, మహమ్మదాలీ, మొదలగు కాంగ్రెసు నాయకులు వర్కింగుకమిటీ సమావేశానికి విచ్చేసినప్పటిదృశ్యాలు జ్ఞప్తికివచ్చేయి.

ఊరేగింపు

14 వ తేదీ భళ్ళున తెల్లవారింది. "రైతు నగర్" వైపుకి వస్తున్నా. 7 గంటలకల్లా అన్నివైపులవీధులలోనుంచి, పొలాలలోఉన్న కాలిబాటలమీదుగాను, ప్రజలు తండోపతండాలుగా ఊరేగింపులో పాల్గొనడానికి సాగి వస్తున్నారు. ఒకరు "అబ్బ! ఎక్కణ్ణించి వస్తున్నారు చీమలబారులలాగ! అంచనా వేయలేం." అన్నారు. పక్కనున్న మరొకరు "భూమి యీనిందా అన్నట్లున్నారు జనం!" అన్నారు. ఔను, నిజమే! భూదేవి బిడ్డలేగా వీరంతాను! అనుకున్నాను

"కయ్యూరు కామ్రేడ్స్ గేటు" కెదురుగా వున్న రాస్తామీద భజనపార్టీవారు కాళ్ళకు గజ్జెలు కట్టుకొని, చేతి చిరుతలతో,

జండాను చేతబట్టి
జాయేంగే కయ్యూరు జాయేంగే"

అంటూ కయ్యూరు కిసాన్ నాయకులకు జోహారులర్పిస్తున్నారు. వాలంటీర్ దళాధిపతి వాలంటీర్లను వరుసలలో నిలబెడుతున్నాడు. పక్కనేఉన్న కొండమీద ఒక ప్రజాసమూహం నిలబడి, అంతులేని జనప్రవాహాన్ని చూచి విస్మయమౌతోంది.

నేనొక సంభాషణ వినడం తటస్థించింది. ఒకాయన అంటున్నాడు: "మరి ప్రభుత్వం రైళ్ళప్రయాణం విషయంలో ఆంక్షవేసినా, బస్సులలో ప్రయాణం చెయ్యకూడదని నిషేధించినా, యింతమందివచ్చారే! అలాచేసి ప్రభుత్వం యేమి బావుకుంది?" మరొకరు "యెనకటికి ఒక యీరవైష్ణవుడు శతకోటి లింగాలలో ఒకలింగం పోయినా పోయినట్టే నన్నాడట; ఆలాగే యీ ఆటంకాలవల్ల ఒక్కడు తగ్గినా తగ్గినట్టే ననుకుంటార్రా అధికారులు!" అన్నారు.

కొత్తగా తయారైన వెంట్రప్రగడ వాలంటీర్ బ్యాండుదళం,

" కదనభూమి కేగుదాం కత్తిదూసి దూకుదాం
ఫాసిజాన్ని రూపుమాపి ప్రజలశక్తి చాటుదాం"

అనే పాటను వాయిస్తూంది. 8 ఎడ్ల జతలచే లాగబడుతూన్న బండిమీద మహాసభాధ్యక్షులైన స్వామీ సహజానంద్, గతసంవత్సరపు అధ్యక్షులు బంకింముఖర్జీ, బీహార్ కిసాన్ నాయకుడు యదునందన్‌శర్మ, సర్దార్ పృథ్వీసింగు కుర్చీలపై ఆసీనులై యున్నారు. రెండవ బండిమీద సుప్రసిద్ధ విద్వాంసుడు రాహుల్ సాంకృత్యాయన్, బెంగాల్ కిసాన్ ఉద్యమ నిర్మాతయైన ముజఫర్ అహమ్మద్, సిక్కునాయకులైన నిధాన్‌సింగు, జగజిత్ సింగ్‌లు కూర్చున్నారు.

ఊరేగింపు బయల్దేరింది.

వరుసవరుసగా, పెద్దపెద్ద బేనర్లతో, రాష్ట్రాల వారీగా బెంగాల్, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడ్, కేరళ, యు. పి., బీహార్, అస్సాం, ఒరిస్సా, హైదరాబాద్, ఆంధ్ర డెలిగేట్ల దళాలు వారి వారి భాషలలో

"అఖిలభారత కిసాన్ మహాసభకు జై"
"స్వతంత్ర భారత్‌కు జై"
"కాంగ్రెసు నాయకుల్ని విడుదలచేయాలి"
"కాంగ్రెస్ - లీగ్ ఐక్యత కావాలి"
"ఆహారసమస్యను పరిష్కరించాలి"
"అధికపంటలు పండించాలి"
"బెంగాల్ ప్రజల్ని రక్షించాలి"

మొదలైన నినాదాలిస్తూ, రైతుగీతాలు పాడుకుంటూ సాగిపోతున్నారు. సరిహద్దు రాష్ట్రం నుంచి డెలిగేట్ లెవరూ రాలేదా అని సందేహించి, ఒక పంజాబ్ డెలిగేటువద్దకు వెళ్ళి అడిగాను. "రాకేం? అదుగో ఖాన్ ఖుషాల్ ఖాన్" అని ఒకపఠాను దేశభక్తునివైపు వేలు చూపించాడు. వెంటనే నాకు సరిహద్దుగాంధీ గఫూర్‌ఖాన్ పేరు జ్ఞాపకం వచ్చింది. ఈయన కూడ "రెడ్‌షర్టు" దళాలలో ఒకజిల్లాదళాధిపతిగా పనిచేసి, కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొని అనేకసార్లు జైలుజీవితం అనుభవించినవాడే. భేష్! అన్ని రాష్ట్రాలలోను రైతుఉద్యమం బలీయమైన శక్తిగా పాతుకుపోయింది! అన్నిరాష్ట్రాలకు యీ మహాసభ ప్రాతినిధ్యం వహించింది.

శిక్షణ, కట్టుబాటు

డెలిగేట్ల వెనుక 3 వేలమంది వాలంటీర్లు ఎర్రజండాలతోను, రైతు - కూలీ నినాదాలతోను, "కుడి-యెడమ", "కుడి-యెడమ" అని కదం తొక్కుతూ కదలిపోతున్నారు. ఇటూ, అటూ జనసమూహం. వెనుక జనసమూహం. షుమారు 20 వేల ప్రజలు పాల్గొన్నారు బ్రహ్మాండమైన యీ ఊరేగింపులో. అయినా, ఒకళ్ళనొకళ్ళు తోసుకోవడం గాని, గొందరపడ్డం గాని యెక్కడా జరగలేదు. ఇంత శిక్షణ, కట్టుబాటు, చూచి అద్భుతం, అపూర్వం అంటూ విద్యాధికులు ప్రశంసించారు.

తోవపొడుగునా న్యూస్‌రీల్‌వారు ఎత్తైన ప్రదేశంమీద నిలబడి, ఫిలింలు తీస్తున్నారు. కామ్రేడ్ జోషీ తన కెమేరాతో ఫోటోలు తీస్తూంటే, ప్రజలు "అదుగో! భారతకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి ఆతడే!" అని కుతూహలంగా చూడసాగేరు.

ఎడమవైపున ఒక మైదానం మీదికి నాదృష్టి మరలింది. పరుగెత్తుకొస్తున్నారు పిల్లలు, యువకులు, కొందరు స్త్రీలు. అందరికంటె వెనుక 60 సంవత్సరాల ఒక ముసలి స్త్రీ పరుగుతీస్తోంది. ఔను, రైతులందరూ తమ లక్ష్యంవైపు సాగిపోతూంటే, తానుమాత్రం వెనుక బడుతుందా? కలుసుకొని, వారితో బాటు తానూ లక్ష్యాన్ని చేరవద్దూ?

బీసెంట్ రోడ్డు వచ్చింది. అన్ని యిళ్ళ ద్వారాలవద్ద, డాబాలమీద, మేడ వసారాలలోను, ప్రేక్షకులే. వారి ముఖాలలో మొదట "యింతమందే!" అను భావాన్ని చూపే వింత, తక్షణమే సంతసం ద్యోతకమవుతున్నాయి. షుమారు 3 వేల మంది రైతాంగపు స్త్రీలను చూచి పట్టణస్త్రీలు నివ్వెరపోయారు.

రెడ్ స్క్వేర్‌ను జ్ఞప్తికి తెచ్చే ఊరేగింపు

పసిపిల్లల్ని చంకబెట్టుకొని, చరచర నడుస్తూంటే, అనేకులు "శభాష్" అన్నారు.

ఏలూరు కాలవవైపుకి ఊరేగింపు తిరిగింది. ఆ రోడ్డు కొత్త సిమెంటు బ్రిడ్జివరకూ సూటిగా 3/4 మైలు పొడవు ఉంటుంది. ఊరేగింపు మొదటిభాగం బ్రిడ్జిదగ్గర ఉండగా, చివరిభాగం చూపుకి ఆనలేదు. షుమారు 30 వేలమంది ప్రజలు వూరేగింపులో పాల్గొన్నారు. యింత పెద్ద వూరేగింపు యివరకెప్పుడూ కూడా చూడలేదని కొందరు కాంగ్రెసువాదు లన్నారు. బంకింముఖర్జీ బండిలో లేచి నిలబడి, ముఖం వెనక్కుతిప్పి, చూచాడు. ఊరేగింపుయొక్క చివరిభాగం కనపడ్డంలేదు. ఆది, అంతంలేదా అన్నట్లున్న రైతు ప్రజాప్రవాహం ఈయనను తన్మయుణ్ణి చేసింది. ఇన్నాళ్ళూ నిద్రితులైయున్న రైతు ప్రజానీకం మేల్కొని, సమాజంలో తమకుండవలసిన స్థానాన్ని ప్రకటిస్తూ, మొట్టమొదటిసారి యిన్ని వేలమంది రైతులు రావడం చూచి, తాముచేసిన శ్రమ ఫలిస్తూన్నదా అన్నట్లు బంకింబాబు మందహాసం చేశాడు. వేలకొద్దీ ఎర్రజండాలు రెపరెపలాడుతూ ఎగురుతున్నాయి సోవియట్‌గడ్డమీదనుంచి నాజీమూకల్ని తరిమితరిమి వెనక్కికొడుతూ, యూరప్‌ప్రజల్ని విముక్తిచేయడానికి, తతిమ్మా బానిసప్రజలందరికీ స్వాతంత్ర్య సంపాదనావకాశాలను కల్పిస్తూ, విజయయాత్రను సాగించే రెడార్మీ నా మనోవీధులలో తళుక్కున మెరిసింది. సోవియట్ యూనియన్‌లో ఉండి వచ్చిన నిధాన్‌సింగ్, రాహుల్ సాంకృత్యాయన్ మొదలైన నాయకులు మాస్కో "రెడ్‌స్క్వేర్" లో ఎర్రసైన్యపు ప్రదర్శనాలు జ్ఞప్తికి వచ్చాయన్నారు.

ఊరేగింపు బ్రిడ్జివాటి టవున్‌లో ప్రవేశించింది. ఒక మలుపులో ముప్పై నలభైమంది ముస్లింలు నిల్చుని చూస్తున్నారు. "కాంగ్రెసు నాయకుల్ని విడుదలచేయాలి!" "కాంగ్రెసు-లీగ్ ఐక్యత కావాలి," అని మిన్నుముట్టే నినాదాలువిని, వారు అంగీకారసూచకంగా తలలూపారు.

ప్రజలు — సైనికులు

పాతటవున్ పూర్తిచేసి, ఊరేగింపు "రైతు నగర్"కు తిరిగివస్తోంది. బ్రిడ్జికి దగ్గరగా వచ్చాం. అప్పుడే మిలిటరీతో రైలు ఒకటి మద్రాసువైపుకి వెళ్తోంది. కిటికీలలోనుంచి తెల్ల ముఖాలు, నల్ల ముఖాలు, కనిపించాయి. మేం బ్రిడ్జికి కిందుగా నడుస్తున్నాం. పైన, రైలుపట్టాలమీదుగా రైలు నడుస్తోంది. తలెత్తి పైకిచూస్తూ నడిచాను. ఒకతెల్లసిపాయి ఎర్రజండాలనుచూచి, పిడికిలిబిగించి, రెండుసార్లు రెడ్‌సెల్యూట్ చేశాడు. అతని వర్గ సోదరులైన భారతీయకార్మిక - కర్షకుల జండాకు వందనంచేసి, ప్రపంచంలో తెల్ల అయినా, నల్ల అయినా, పీడితవర్గమంతా ఒకటేనను భావాన్ని సూచించాడు. పక్కపెట్టెలో నల్లసిపాయిలున్నారు, వారు సిగరెట్టుపెట్టెలు, బిస్కెట్‌పొట్లాలు ప్రజలమీదికి విసిరారు. నేనుకూడా ఒక బిస్కెట్టుపొట్లం అందుకొని, రెండు బిస్కెట్లుతిని, మిగతావి చుట్టుపక్కలవారికి పంచిపెట్టాను.

ప్రజలకూ, సైనికులకూ, మధ్య ఉండవలసిన పొత్తు యీ ఘటనవల్ల ద్యోతకమవుతోంది.

క్రమంగాఊరేగింపు బందరురోడ్డుమీదుగా "రైతునగర్" చేరుకుని, "కొమ్మారెడ్డి గేటు" ద్వారా పెండాల్‌లో ప్రవేశించింది. బంకిం



— బంకిం ముఖర్జీ —

ముఖర్జీ 50 వేల మంది ప్రజలయెదుట, జయ జయ ధ్వానాలమధ్య, పతాకోత్సవం జరిపారు.

మహాసభ

14 వ తేదీ సాయంకాలం 4 గంటలకు మహాసభ ప్రారంభమైంది. "కొమ్మారెడ్డి గేటు" వద్ద నలుగురైదుగురు నిలబడి మాట్లాడుకొంటున్నారు. ఒకరు "50 సంవత్సరాలకు కాంగ్రెసు బ్రహ్మాండమైన సంస్థగా వృద్ధిచెందింది; ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. కాని, యీ సంస్థ (రైతుసంఘం) 8 సంవత్సరాలకే యింతవృద్ధికి వచ్చింది." అని ఆశ్చర్యంగాఅంటున్నాడు. మహాసభకై జరిగినయేర్పాట్లు, వచ్చినజనసమూహం, క్వారీ కూలీలనుకూడా ఉత్తేజపరిచాయి. పక్కనే కొండను పగుల కొడుతూన్న క్వారీ కూలీలు

"నిన్న మొన్న మనకు తిండైన లేదురా
నిద్దుర లేదాయె ఓరోరి జంబన్న"

అంటూ సొంతకవిత్వంలోపాటపాడుతున్నారు.

మొదటిరోజు మహాసభకు ఆవరణలో షుమారు 70 వేల మంది, ఆవరణ బయట 20 వేల మంది, ప్రజలు హాజరయారు. మొదట ఆహ్వానసంఘ కార్యదర్శి కామ్రేడ్ నండూరి ప్రసాదరావు వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన రైతాంగనాయకులలో ముఖ్యులందరినీ ప్రజల కెరుకపరచి, పుష్పమాలాలంకృతుల చేశారు.

తరువాత, ఆహ్వానసంఘ అధ్యక్షుడైన కామ్రేడ్ వాసు మన రాష్ట్రంలో రైతుసంఘం యింతవరకూ సాధించిన విజయాలనుగూర్చి, అవలంబించిన విధానాన్నిగురించి, వివరిస్తూ, రైతుసంఘాన్ని యింకా బలపరచవలసిందని కోరుతూ, ఉపన్యసించారు. మహాసభాధ్యక్షులైన స్వామీజీ రైతువుద్యమ నిర్మాణానికై తమ యావచ్ఛక్తినీ వినియోగించె రైతుసేవకులు కావాలని హెచ్చరించారు.

దూరశ్రవణయంత్రాలుసరిపోనందున యీ రెండు ఉపన్యాసాలు చివరకూర్చున్న వారికి వినబడలేదు. అందువల్ల కొందరికి ఆశాభంగం కలిగింది. కాని, రెండుమూడు గంటలు అయాక అదనంగా కొన్ని దూరశ్రవణయంత్రాలు వచ్చాయి. అప్పటినుంచీ ఉపన్యాసాలు, యితర కార్యక్రమం ప్రజలందరికీ వినబడేటట్లు యేర్పాట్లు జరిగాయి.

మరునాడు, బళ్ళుకట్టుకొని వచ్చి, సొంతంగా వంటలుచేసుకొనే రైతు కుటుంబాల వద్దకు వెళ్ళాను. కొందరు స్త్రీ లొకచోట నిలబడి మాట్లాడుకొంటున్నారు. వారిలో ఒక ఆమె వయస్సు షుమారు 50 ఉంటుంది. ఆమె యితరులతో ఇలా చెబుతోంది: "మా వూళ్లో కొందరు సభకు వెళ్ళవద్దని, బుర్రలు బద్దలవుతాయని చెప్పారు. ఊళ్లో జరిగే తగాదాలలో బుర్రలు బద్దలుకొట్టించుకొనే కంటె ఎంతకైనా సాహసించి ఇలాంటిసభకురావడం మంచిదే కాదమ్మా?" మరొకచోట 4 గురు రైతులు సమావేశమై యున్నారు. అందులో ఒకరైతు యిలా అంటున్నాడు: "మా ఊళ్లో నుంచి నాలుగుబళ్ళు వచ్చాయి. మరోనాలుగు బళ్ళు వచ్చేవేకాని, ఏమిజరిగిందంటే, కంకిపాడువద్ద పోలీసులు బళ్ళను తిప్పేస్తున్నారనీ, పాకలు పీకేస్తున్నారనీ, యెవరో పుకారు లేవదీశారు. మేం మాత్రం సరాసరి బయల్దేరి వచ్చేశాం."

రెండవరోజు మహాసభ

15 వ తేదీ మహాసభయొక్క రెండవ రోజు. సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకులైన శ్రీ బులుసు సాంబమూర్తిగారు ఉపన్యాసవేదిక యెక్కి యిలా ఉపన్యసించారు.

"యుద్ధం మనదేశానికింకా రాకపోయినా, దాని ఫలితాలన్నీ మనం అనుభవిస్తున్నాం. కరువువల్ల లక్షలాది జనం చనిపోతున్నారు. దీనికి కారణం ప్రజావిశ్వాసాన్ని చూరగొన్న జాతీయప్రభుత్వం లేకపోవడమే. పండిన పంటను ప్రజలకు సక్రమంగా పంచిపెట్టగల ప్రభుత్వం లేదు. ఈ యుద్ధంలో ప్రజాపక్షం గెలిచి, దుష్టశక్తులు నాశనం కావడానికి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించక పోవడం అత్యాశ్చర్యకరంగా ఉంది. ప్రపంచ ప్రజాస్వాతంత్ర్యం 40 కోట్లమంది భారతీయుల స్వాతంత్ర్యంపై ఆధారపడియుంటుంది. జాతీయప్రభుత్వ స్థాపనద్వారా కరువు సమస్య, అంటురోగాల సమస్య, పరిష్కరించబడతాయి. అట్టి జాతీయప్రభుత్వ స్థాపన కొరకు కిసాన్‌సభ పాటుపడుతుందని ఆశిస్తున్నాను."

తరువాత, భారతకమ్యూనిస్టుపార్టీ తరఫున డాక్టర్ అధికారి కిసాన్‌సభకు సందేశమిస్తూ, యిలా ఉపన్యసించారు: "రైతాంగసంస్థయైన అఖిలభారత కిసాన్‌సభకు కార్మికవర్గపార్టీయైన కమ్యూనిస్టుపార్టీ జోహారులర్పిస్తోంది. ఈ రెండు సంస్థలమధ్య సోదరభావముంది. ఎందువల్లనంటే. (మిగతా 11 వ పేజీలో)

ప్రభుత్వంయొక్క ఆహారసేకరణ విధానం

అఖిలభారత రైతుమహాసభ గత సంవత్సరం భాక్నాసమావేశంలో ఆహార పరిస్థితులు రోజురోజుకూ విషమిస్తున్నవని గుర్తించింది. స్టాకులను కంట్రోలు చేయకుండా, ధరలను కంట్రోలు చేస్తున్న ప్రభుత్వంయొక్క నిష్ఫల, అరాజక విధానంవల్ల దేశం విపరీత పరిస్థితుల్లో పడబోతున్నదని హెచ్చరించింది. కంట్రోలు ధరలకు, ఆహారమూ, ఇతర జీవితావసర వస్తువులు నగరవాసులకూ పల్లెటిప్రజలకూ అందుబాటులోకి రావాలంటే ధరలను తగ్గించాలి; స్టాకులను బాగా కంట్రోలుచేయాలి; గుత్తదారుణ్ణి, నిల్వవ్యాపారస్తుణ్ని లేకుండా చేయాలి. ఇందుకొరకు రైతులూ, ప్రజలూ ఐక్యమై ఆహార కమిటీలు పెట్టుకుని ఆందోళనచేయాలి. కిసాన్ సభ హెచ్చరించినట్లే జరిగింది. బెంగాల్, ఒరిస్సా, కేరళ, కొన్ని ఆంధ్రప్రాంతాలనూ చరిత్రలో ఎరుగని కరువువచ్చి బీడుచేసింది. ఒక్క బెంగాలులోనే 50 లక్షల ప్రాణాలకు పైగా బలితీసుకుంది. అమెరీగారి బండవాదనలు ఎంతకాదంటున్నాగాని, గత సంవత్సరపు కరువు ప్రకృతి అవాంతరాలవల్ల రాలేదని, మానవుడే సృష్టించాడనీ కిసాన్‌సభ నమ్ముతున్నది: యీపాటికందరికీ తెలిసిపోయింది కూడాను. నిరంకుశ ప్రభుత్వం నిలవదారులను నమ్మి దివాలాకోరు విధానాన్ననుసరించింది. ఈ విధానంవల్ల ఆహార ధాన్యాల స్టాకులను చేతబెట్టుకున్నవారు చెలరేగి, నిలవ చేయుటవల్లా, దొంగమార్కెట్లలో అమ్మడంవల్ల కరువువచ్చింది.

1943 నవంబరులో కేంద్ర ప్రభుత్వం ప్రధాన ఆహారసమస్యా పరిష్కార విధానాన్ని (Basic food plan) నిర్ణయించింది. ఈ విధానంయొక్క ఆశయాలు: ఆహార ధాన్యాల ధరలను ఒక పద్ధతి ప్రకారం నిర్ణయించటం, వ్యవసాయదారుకు న్యాయమైన ఆదాయం వచ్చేటట్లు చూడటం, లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాలలో రేషనింగును న్యాయమైన ధరలతో, అమలుపరచటం. కేంద్రప్రభుత్వం ఈ విధానం అమలు జరపటానికి మిగులు రాష్ట్రాలకు, తరుగు రాష్ట్రాలకు పంపవలసిన కోటాలు నిర్ణయించింది. ఆయా రాష్ట్రప్రభుత్వాలు నిలవలపైన కంట్రోలు ఏర్పరుచుకోడానికి, నేరుగా వ్యవసాయదారుల నుండి వారు అమ్మజూపే మిగులు ధాన్యం నుంచి కొంతభాగం సేకరించాలని తాఖీదు చేసింది. ప్రభుత్వం ఈ ప్రధాన ఆహార సమస్యా పరిష్కార విధానాన్ని తలపెట్టడానికి బెంగాలులో జరిగినంతటి విషాదఘట్టం జరగాలిసివచ్చింది. ఇండియాను మరోసారి కరువునుంచి రక్షించాలంటే ఈ విధానాన్ని జయప్రదంగా ఆచరణలో పెట్టాలి.

ఈ విధానం కాగితంమీద ఉన్నంతవరకూ గట్టిదే; కాని ఈవిధానానికంతటికీ కీలకమైన ఆహారధాన్యాన్ని సేకరించటంలో కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వాలూ అనుసరిస్తూన్న దివాలకోరు పంథావల్ల భగ్నమౌతూంది. కొన్నిరాష్ట్రాల్లో ధాన్యాన్ని సేకరించటమేలేదు. చేసేరాష్ట్రాల్లో చాలినంత చేయకపోవటంగాని, పూర్తిగా విఫలమవటంగాని జరుగుతున్నది. ప్రభుత్వం, ఆహార ధాన్యాలను కొనటానికి గుత్తదారులమీద, నిలవ వ్యాపారస్తులమీద ఆధారపడుతూంది. వ్యవసాయదారునికి రావలసిన కనీసధరలను నిర్ణయించ నిరాకరిస్తూంది. ధరలనునిలకడగా ఉంచడంలో మొత్తంమీద విఫలమైంది. ఇందువల్లనే ఆహార సేకరణలో విఫలమైంది. ఫలితం మార్కెటు నిలవదారుల, దొంగ వ్యాపారస్తుల చేతుల్లో పరాకత్‌గా వదలివేయబడ్డది. ధాన్యమంతా మళ్లా వారి చేతుల్లోకి పోతూంది. ఇది వివిధరాష్ట్రాల్లో వివిధమార్గాల సంభవిస్తూంది.

ఉదాహరణకు, బెంగాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలయొక్క, ఆహారకమిటీలయొక్క సహకారం తీసుకోకుండా, నిలవవ్యాపారస్తులను కొనుగోలు ఏజెంట్లుగానియమించి 1943 లో ప్రజల ఆహారాన్ని దొంగిలించిన వారిచేతికే 1944 లో గూడ ప్రజల ఆహారాన్ని అప్పచెప్పటంచేత శీతాకాలపు పంట సేకరించడంలో విఫలమైంది. తత్ఫలితంగా తరుగుజిల్లాలలో ధరలు పెరుగుతూన్నవి; బెంగాలుమరల రెండోకరువులోచిక్కుకుంది.

అదేవిధంగా బొంబాయిలో (వ్యాపారస్తులకుండే) మంచి ధరలొస్తాయనే ఆశపైన ఆధారపడి ప్రజాసహకారాన్ని విస్మరించడం చేత సేకరణ విధానం విఫలమైంది. ఆహార ధాన్యాలు ముఖ్యంగా భూస్వాముల, వడ్డీ వ్యాపారస్తుల, నిలవదారుల చేతుల్లోకి పోయినవి. అనేక జిల్లాలకు కొరత ఏర్పడింది. ఇప్పుడో; ప్రభుత్వం రిక్విజిషన్ ఆర్డరు జారీచేసింది. ఆర్డరు అమలు జరపడంలో ప్రజలు చురుకుగా జోక్యం పుచ్చుకోకుండా స్థానిక నిరంకుశాధికారులే అమలు జరిపితే విపరీత పరిస్థితు లేర్పడతాయి.

మద్రాసులో కూడ యీ విధంగానే విఫలమైనదువల్ల ఆంధ్ర, తమిళ రాష్ట్రాలలో తరుగుజిల్లాలూ, ప్రత్యేకంగా మలబార్, తిరువాన్‌కూర్, కొచ్చిన్‌లలోను తరుగు ఏర్పడ్డది. బీహారు, సంయుక్త రాష్ట్రాల్లో పరిస్థితులుగూడ ఇలాగే ఉన్నవి.

పంజాబ్‌లాంటి మిగులు రాష్ట్రాలలో ఇంతవరకు ధరల కంట్రోలులేదు. రేషనింగు లేదు. ధాన్యసేకరణలేదు అంచే రాష్ట్రంలో ఉన్న బీదప్రజలు ఎక్కువ ధరలకు కొనుక్కోవాలి.

ఒరిస్సాలో సరైనఏర్పాట్లు లేనందువల్ల ప్రభుత్వంయొక్క ఆహారసేకరణ, పంపకవిధానం విఫలంగావటానికి తయారుగా ఉంది. ఏప్రిలు అయ్యేటప్పటికి రాష్ట్రం తీవ్రమైన ఆహార సంక్షోభంలో పడుతుంది. ప్రభుత్వం ఆహారాన్ని రెక్విజిషన్ చేయవలసివస్తుంది.

మిగులు ప్రాంతమైన మధ్యరాష్ట్రంలో వ్యవసాయకులకొరకు న్యాయమైన కనీస ధరలను నిర్ణయించకుండానే ధాన్యసేకరణకు ప్రయత్నించడంవల్ల, వ్యవసాయదారుడికి నష్టమైనా వస్తున్నది లేదా ఆహారధాన్యమంతా భూస్వాములయొక్క, నిలవవ్యాపారస్తులయొక్క కొట్లల్లోకైనా చేరుతున్నది.

స్థితిగతు లీ విధంగా వుండటంవల్ల దేశాన్ని రెండోసారి కరువునుండి రక్షించాలంటే రాష్ట్ర రైతుసంఘాలూ, రైతులూ, మిగిలిన ప్రజలతోకలసి, ధరల కంట్రోలూ, రేషనింగు కొరకు ఆందోళన చేయటమేగాక ప్రభుత్వంయొక్క ఆహారసేకరణ, రెక్విజిషనింగు ప్రయత్నాలు సఫలమై రైతులకు న్యాయమైన ధరలు వచ్చేట్లు, ప్రజలందరికీ అందుబాటైన ధరలకు ఆహారం దొరికేట్లు చూడాలని ఈ సమావేశం కోరుతూంది.

ఇందుకొరకు ప్రభుత్వం యీక్రింది చర్య తీసుకోవాలి.

(ఎ) ప్రస్తుత పరిస్థితుల్లో తన ధాన్యం అమ్మినప్పుడు రైతుకు సరియైన ఆదాయం వచ్చేట్లు కనీసధరలను నిర్ణయించాలి.

(బి) పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ ఉండే ప్రజలకు అందుబాటులో ఉండేట్లు ఆహార ధాన్యాలకు గరిష్ట ధరలను నిర్ణయించాలి.

(సి) నిర్ణయించిన ధరలకు ధాన్యం అమ్మకానికీ, కొనుగోలుకూ, దొరకాలంటే ప్రభుత్వం ప్రజలయొక్క, ఆహారకమిటీలయొక్క రైతుసంఘాల సహాయంతో సేకరణనూ, రెక్విజిషనింగున్నూ అమలు జరపి, ధాన్యం జమీందారు, నిల్వవ్యాపారస్తుల చేతుల్లో పడకుండా చూడాలి. ఇందుకొరకు ప్రభుత్వం కొనుగోలు ఏజంట్లనూ, సబ్ ఏజెంట్లనూ నియమించి వారిపేర్లను ప్రజలందరికి తెలిసేట్లు ప్రకటించాలి. ఏ పరిస్థితుల్లోనూ నిలవవ్యాపారస్థులను ఏజంట్లుగా నియమించరాదు. నియమింపబడిన ఏజంట్లు ఆహారకమిటీల సహకారంతో నిర్ణయింపబడిన కనీస ధరలకే కొనాలి. సరియైన లెక్కలు వ్రాయాలి. సరియైన రశీదులివ్వాలి. అప్పుడప్పుడూ తమదగ్గర స్టాకులెంతెంత ఉన్నవో ప్రకటిస్తూఉండాలి.

(డి) పెద్ద, చిన్న పట్టణాలన్నిటిలో, రేషనింగు ప్రవేశపెట్టి, కంట్రోలు ధరల దుకాణాలు తెరవాలి. తరుగైన పల్లె ప్రాంతాల్లో రేషనింగు ప్రవేశపెట్టాలి.

(ఇ) గుడ్డ, కిరోసిన్, ఉప్పు, అగ్గిపెట్టెలు మొదలైన ఇతర వస్తువులు ప్రభుత్వ దుకాణాల ద్వారా కంట్రోలురేట్లకు పల్లెటి ప్రజలకు అందేటట్లు చేయాలి.

రైతులు, రైతుసంఘాలూ, యీ క్రింది కార్యక్రమం అనుసరింపమని ఈసభ హెచ్చరించుతూంది.

1. నిలవవ్యాపారులకు ధాన్యం అమ్మకుండా రైతులను ఆపగలిగిన ఐక్య ఆహార కమిటీలను నిర్మించాలి.

2. గవర్నమెంటు ఏజంటులు నియమింపబడినచోటనెల్లా వారికే రైతులు తమ ధాన్యాన్ని అమ్మేట్లు ఆహారకమిటీలూ, రైతు సంఘాలూ చూడాలి. సమిష్టిబేరంద్వారా రైతులకు న్యాయమైన ధరలు వచ్చేట్లు చూడాలి. ఆహారసేకరణం ఎక్కడ అమలు జరుపబడ్డదో అక్కడల్లా అది జయప్రదమయ్యేట్లు చూడాలి. అయితే యిది బీద రైతుపైన భారంవేయటంవల్లగాని, బలవంతం పెట్టటంవల్లగాని జరుగగూడదు. జమీందారులయొక్క, ధనికరైతులయొక్క నిల్వ మిగులు ధాన్యం బయటకువచ్చేట్లు నిల్వదారికానికి వ్యతిరేకంగా ఆందోళనచేయటం ద్వారా యీ ఆహారసేకరణను జయప్రదం చేయాలి.

3. ఆహారసేకరణపద్ధతి ఇంకాఅమలులో లేని ప్రదేశాల్లో రైతులు తమ మిగులు ధాన్యాన్ని ఆహారకమిటీలకూ, రైతుసంఘాలకూ నిర్ణయింపబడ్డ కనీసధరలకు అమ్మేట్లు చూడాలి. ఇలా సేకరించిన ధాన్యంతో పల్లెటి ప్రాంతాల్లో కో-ఆపరేటివ్‌స్టోర్సులను ఏర్పాటుచేసి, ఆహారం తక్కువైన పల్లె ప్రజలకు నిర్ణయించిన అమ్మకం ధరల ప్రకారం అందజేయాలి.

4. ఆహార కమిటీలు, రైతు సంఘాలూ గ్రామైక్యతపై ఆధారపడిన, స్వయం సహాయక ఉద్యమాన్ని నిర్మించి సంవత్సరం పొడుగునా బీదలకూ, అన్నాతురులకూ అన్నం పెట్టడానికి ధాన్యపు పండును ఏర్పరచాలి.

5. కరువు ప్రాంతాల్లోనూ, తరుగు ప్రాంతాల్లోనూ, గ్రామప్రజలనందరినీఉత్సాహపరచి, కరువుబాధితులకు నిర్మాణాత్మకంగా సహాయం చేయాలి.

నిలవవ్యాపారస్తులకూ, నిరంకుశాధికారులకూ వ్యతిరేకంగా పోరాడి రైతులకు న్యాయమైన ధరలను సంపాదించుటకూ, అందరికీ అందుబాటైన ధరలకు ఆహారాన్ని అందజేయుటకూ, గ్రామాల్లో స్వయంసహాయకోద్యమాన్ని నిర్మించుటకూ, కరువుబాధితులకు సహాయముచేయుటకూ, రైతుసంఘాలు చేస్తూన్న కృషిలో అన్ని తరగతుల ప్రజలూ ముఖ్యంగా కాంగ్రెసువాదులూ, లీగ్‌వాదులూ సహకారంచేయవల్సిందిగా అఖిలభారతరైతు మహాసభ విజ్ఞప్తి చేస్తూంది. రైతుసంఘంతో చేతులుకలిపి, అందరూ, సర్వతోముఖమైన ఐక్యతతో సమిష్టిగా కృషిచేయటంద్వారానే దేశం రెండోసారి కరువునుండి రక్షింపబడగలదు.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడుచెలల చందా	1—4—0

కిసాన్‌సభ రాజకీయ పంథా

జాతీయతకు వ్యతిరేకులైన విచ్ఛిన్నకారులు కొందరు నానాటవృద్ధిపొందుచున్న కిసాన్‌సభబలాన్ని చూచి, అసూయతో కమ్యూనిస్టులు తమపాలసీని కిసాన్‌సభపై రుద్దుతున్నారని నిందలువేస్తున్నారు. ఫాసిస్టు వ్యతిరేకులను, దేశభక్తులను కిసాన్‌సభతో కలసి పనిచేయకుండా చేయడానికే యీ దుష్ప్రచారం ఉద్దేశింపబడింది. రైతులను, దేశాన్ని ఎదుర్కొంటున్న ఆహారసమస్యవంటి వాటితోకలసి పనిచేయకుండా చేయడానికే ఉద్దేశింపబడింది. కిసాన్‌సభ నిజపాలసీ తెలియక అపార్థంచేసికున్న యితరులుకూడ కొందరున్నారు. అందుచే అఖిల భారత కిసాన్ మహాసభ గత రెండుసంవత్సరాలుగా తీర్మానాలద్వారా స్పష్టపరచబడిన తన రాజకీయపాలసీని పునరుల్లేఖించడం అవసరమయింది.

జపాన్ ఫాసిస్టుల దండయాత్ర ప్రమాదం మనదేశానికి ఏర్పడగానే కిసాన్‌సభ రైతులను రష్యా, చైనాలపక్షాన, మిత్రరాజ్యాలపక్షాన నిల్చబడవలెనని ఉద్బోధించింది. ఫాసిజాన్ని తుదముట్టించడానికి నిరంతరం పోరాడాలని స్పష్టపరచింది. "చైనాకు, రష్యాకు సాధ్యమైనన్నివిధాల సాయపడమనీ, సోవియట్ మిత్రుల సంఘాలను నిర్మించాలనీ" కోరింది. "జాతీయప్రభుత్వంక్రిందనే సంపూర్ణ విజయవంతంగా దేశరక్షణ సాధ్యమవుతుందని" కూడ ప్రకటించింది.

అభివృద్ధినికోరే శక్తులతో కలసి మాతృదేశ రక్షణ చేయడానికి, శాసనసభకు, భారత ప్రజలకు, బాధ్యత వహించేసంయుక్త జాతీయ ప్రభుత్వం కావాలని కిసాన్‌సభనమ్ముతూంది. భారత దేశంయొక్క సంపూర్ణ స్వాతంత్ర్య హక్కును, యుద్ధానంతరం రాజ్యాంగాన్ని నిర్ణయించుకొనే హక్కును గుర్తించుతూ ప్రకటనచేయాలి. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ సంయుక్త జాతీయ ప్రభుత్వాలను ఏర్పరచాలి.

స్వాతంత్ర్య కాంక్షితులైన తమ ప్రజల ఒత్తిడివల్లను, యుద్ధావసరాలవల్లను, సామ్రాజ్య రక్షణ ఉద్దేశంతోనూ బ్రిటను, అమెరికా ప్రభుత్వాలు ఫాసిస్టులకు వ్యతిరేకంగా రష్యా చైనాలవైపున పోరాడుతున్నాయని కిసాన్ సభ అభిప్రాయపడుతూంది. భారత జాతీయ ప్రభుత్వంయొక్క నాయకత్వంక్రింద, భారత ప్రజలహృదయపూర్వకసహకారంతో నడుపబడినపుడే యిది భారత ప్రజల యుద్ధమవుతుందనికూడ కిసాన్‌సభ నమ్ముతూంది.

భారత ప్రజల స్వాతంత్ర్యకాంక్షను ఆచరణలో పెట్టడానికి, ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదిరించడానికి కాంగ్రెసు, ముస్లింలీగుతోసహా జాతీయ సంస్థలన్నీ కలసి సాధ్యమైనంత విశాలమైన ఐక్యతను నిర్మించి, జాతీయ ప్రభుత్వం కొరకు కృషిచేయాలని కిసాన్ సభ కోరుతూంది.

1942 ఆగస్టులో ప్రభుత్వం జాతీయ నాయకులను అరెస్టు చేసింది. విచక్షణరహితమైన నిర్బంధవిధానంప్రయోగించింది. దానితో కోపోద్దీపితులైన ప్రజలు తప్పుమార్గాన నడుపబడి, దేశరక్షణలనుభగ్నపరచే విధ్వంసక చర్యలకు పూనుకొన్నారు. ఈ అవకాశాన్ని దేశద్రోహులైన పంచమాంగదళం తన దురుద్దేశాలకు వినియోగించుకొంటోంది. ఆసమయంలో కిసాన్‌సభ తన ఫాసిస్టువ్యతిరేకపాలసీకి, దేశభక్తి సాంప్రదాయాలకు అనుగుణ్యంగా పనిజేసింది. విధ్వంసకచర్యలకు వ్యతిరేకంగా రైతాంగంలో పనిచేసింది. నిర్బంధ విధానంవల్ల వాయిరెచ్చి అరాజక చర్యలలో పాల్గొనకుండా కృషి చేసింది.

హిందూ-ముస్లిం ప్రజల ఐకమత్యం ద్వారానే నిరంకుశాధికారులను ఎదిరించగలమని కిసాన్‌సభ విశ్వసించుతూంది. తద్వారానే కాంగ్రెసు-లీగ్ ఐక్యత నిర్మించగలమనీ, దేశరక్షణ కొరకు-స్వాతంత్ర్యం కొరకు జాతీయ ప్రభుత్వం సాధించగలమని నమ్ముతూంది.

జాతీయ నాయకుల విడుదల కొరకు, విధ్వంసక చర్యలను ఆపుచేయడానికి, ఆహార సమస్యను పరిష్కరించడానికి, హిందూ ముస్లిము ప్రజలను ఏకం చేయడానికి, అన్ని వర్గాల ప్రజలతో కలసిపనిచేసి సంపూర్ణ జాతీయైక్యతను నిర్మించడానికి రైతాంగం కృషిచేయాలని కిసాన్‌సభ కోరుతూంది.

యుద్ధవత్తిడి మూలంగానూ, జాతీయ ప్రభుత్వం లేమివల్లనూ ఆహారసంక్షోభం మరింత తీవ్రమయిందని కిసాన్‌సభ గుర్తించుతూంది. అందుచే రాష్ట్ర-జిల్లా రైతుసంఘాలు యీ విషయమై చొరవతో పనిచేసి వ్యవసాయదారులకు న్యాయమైనధరలు వచ్చేలాగున, ప్రజలందరకు న్యాయమైన కంట్రోలు ధరలకు ఆహారం దొరికేలాగున కృషిచేయాలి. రైతులను ఉత్సాహపరచుటద్వారాను, దేశరక్షణలో ఆహారసమస్యకున్న ప్రాముఖ్యతను యితరులకు నచ్చచెప్పుటద్వారాను అధికపంటల ఉద్యమాన్ని సాగించాలని కిసాన్‌సభ కోరుతూంది.

కిసాన్‌సభ ఫాసిజానికివ్యతిరేకంగా దేశభక్తియుతమైన పాలసీని అనుసరించడంవల్లను, ఐక్యతకోసం, జాతీయనాయకుల విడుదలకోసం, ఉద్యమాలను నడుపుటవల్లను, రైతులను ఐక్యపరచి సంఘటితం చేయడానికి కృషిచేయడంవల్లను, వారి హక్కులకొరకు పోరాడటంవల్లను, ఆహారసమస్యపరిష్కరించడానికి, అధికపంటల పండించడానికి, కృషిచేయడంవల్లను కిసాన్‌సభ ప్రజాసంస్థగా బలపడింది. జాతీయసంక్షోభాన్ని తొలగించడానికి, రైతుల సేవచేయడానికి, కాంక్షించుతున్న కాంగ్రెసువాదులు, లీగ్‌వారు తదితర దేశభక్తులు కిసాన్‌సభవైపు వస్తున్నారు. కిసాన్‌సభలో కమ్యూనిస్టులున్నప్పటికి కిసాన్ సభపాలసీ ఏ పార్టీవల్లగాని, గ్రూపువల్లగాని నిర్ణయించబడటంలేదు. అందరూ సమిష్టిగా చర్చించి పనిచేయడంవల్లనే కిసాన్‌సభ కార్యక్రమం నిర్ణయించబడుతూందని పై దేశభక్తులకు కిసాన్‌సభ హామీ యిస్తూంది.

కిసాన్‌సభపాలసీ చాల విశాలమైనదనీ, దానిలో పనిచేయడానికి దేశభక్తులందరికి అవకాశంవుందనీ యీ మహాసభ విన్నవించుతూంది. ఫాసిస్టువ్యతిరేకులు, స్వాతంత్ర్య కాంక్షితులు అయినవారు ఏ పార్టీకి చెందినవారైనప్పటికి కిసాన్‌సభలోచేరి రైతులకు సేవచేయడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తూ రైతులను సంఘటితపరచడానికి పూర్తి అవకాశాలున్నాయని స్పష్టపరుస్తూంది.

సానుభూతి తీర్మానాలు

అఖిలభారత కిసాన్‌సభ కస్తూరిబాయి జైలులో మరణించినందుకు యావద్భారత జాతితోపాటు విచారాన్ని వెల్లడించుతూంది. భారత మహిళల సుసాంప్రదాయాలన్నీ కస్తూరిబాయిలో మూర్తీభవించాయి. జైలులో ఆమె మరణానికి ప్రజలందరిలో కల్గిన దుఃఖాన్నైనా నిరంకుశాధికారులు లెక్క చేయలేదు. కిసాన్‌మహాసభ గాంధీజీకి, వారి కుటుంబానికి కల్గిన తీరనినష్టానికి హృదయపూర్వక సానుభూతిని తెలుపుతూంది.

ఆర్. యస్. పండితుని అకాలమరణానికి రైతుమహాసభ విచారాన్ని తెలిపింది. విజయలక్ష్మి కుటుంబానికి సానుభూతి తెలుపుతూంది.

1943 సంవత్సరం కిసాన్‌సభ చాల దుఃఖభాజనమైనది కరువు, అంటువ్యాధులు వ్యాపించి రైతుసేవకులలో అనేకమందిని తమ పొట్టబెట్టుకున్నాయి. రైతులలో లక్షల కొలది స్త్రీలు, పురుషులు, బాలబాలికలు మరణించారు. వారందరి మరణానికి కిసాన్‌మహాసభ సంతాపాన్ని వెల్లడించుతూంది. (ప్రత్యేకంగా రైతుసేవకులగు కామ్రేడ్ బంకింమైత్రి వగయిరా 20 మంది బెంగాలు యోధులను, ఆంధ్రలో కామ్రేడ్ పెన్మెత్స సూర్యనారాయణరాజు, ఒరిస్సాలో కామ్రేడ్ పాణిగ్రాహి, అస్సాంలో కామ్రేడ్స్ రహేన్‌దత్తా, ఆదం ఆలీ మొదలగువారి పేర్లు ఉదరించబడ్డాయి.)

అఖిలభారత కిసాన్‌సభ కీర్తిశేషులయిన యీ రైతు సేవకుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలుపుతూంది. ఈ కామ్రేడ్స్ ఏ ఆశయంకోసం కృషిచేసి, చనిపోయారో అదే ఆశయసిద్ధికొరకు కృతనిశ్చయులమై పనిచేస్తామని వాగ్దానంచేస్తోంది.

కపూర్తలా సంస్థానంలో రైతుసేవకుడైన కామ్రేడ్‌రాంసింగ్‌ను ఖూనీచేసిన పంచమాంగదళ చర్యను ఖండించుతూ, కామ్రేడ్ కుటుంబానికి సానుభూతి తెలుపుతూంది.

సోవియట్ ప్రజలకు రెడ్‌ఆర్మీకి జేజేలు

★

లక్షలకుపైగా సంఘటితమైన రైతులకు ప్రాతినిధ్యం వహించుతున్న అఖిలభారత కిసాన్ మహాసభ సోవియట్ ప్రజలకు, రెడ్ ఆర్మీకి, వారి నాయకుడు-సేనాని అయిన మార్షల్ స్టాలినుకు విప్లవాభివందనాలు తెలుపుతూంది.

స్టాలిన్‌గ్రాడ్‌లో హిట్లరు మూకలను ఛించి చెండాడి యుద్ధగతినే మీరుతారుమారు చేశారు. తద్వారా మా దేశాన్ని, మధ్యప్రాచ్య దేశాలను ఫాసిస్టులదాడినుండి రెడార్మీ రక్షించింది. ఈ విషయం జానపదాలలోనూ, గీతాలలోనూ ప్రజలుచే పాడబడుతూంది.

ఫాసిస్టు దుండగీడులపై మీరు ఎడతెగకుండా దెబ్బలు కొడుతున్నారు. శత్రువును తుదముట్టించడానికి మీరు గతజూన్‌లో కుర్క్స్-ఓరెల్ రంగంలో దండయాత్ర ప్రారంభించారు. నాటినుండి హిట్లరుకుఓటమి తరువాత ఓటమి వస్తూంది.

కొలది కాలంలోనే యూరపులో రెండోరంగం తెరువబడుతుంది. హిట్లరు రాక్షసపాలన అంతమొందుతుంది. సోవియట్ భూమిపై హిట్లర్‌మూకలు చేసిన దుండగాలకు తగిన ప్రాయశ్చిత్తం చేయబడుతుంది. యూరపు ప్రజల స్వాతంత్ర్య సంపాదనకు ప్రత్యక్షంగా రెడార్మీ సహాయం చేస్తుంది.

విభ్రాంతి గొల్పే మీ విజయాలు యూరపు ప్రజలకు స్వాతంత్ర్య మివ్వడమేగాకుండా, జపాన్ దురాక్రమణదారులను ఓడించి భారత దేశానికి, చైనాకు, యితర తూర్పుదేశాల ప్రజల విమోచనానికి, అనుకూల పరిస్థితులు కలిగించుతాయి. మృత్యువును లెక్కచేయని మీ వీరుల శౌర్యానికి, మీ సేనానుల వ్యూహరచనా నైపుణ్యానికి మాకిసాన్‌సభ జోహారులర్పించుతూంది. మీ వీరోచితకృత్యాలు మా ప్రజలు ఏకమవడానికి ఉత్సాహాన్నిస్తున్నాయి. ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే ప్రపంచ ప్రజాపోరాటంలో భారతప్రజలపాత్రను నిర్వహించడానికి ప్రోత్సాహమిస్తున్నాయి.

చైనాప్రజలకు జోహారులు

★

జపాన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అకుంఠిత ధైర్యంతో పోరాడుతున్న చైనాప్రజలకు అఖిలభారత కిసాన్ మహాసభ జోహారులర్పించుతూంది.

ఫాసిస్టు దండయాత్ర ప్రమాదాన్నెదుర్కొడానికి చైనాప్రజలు జాతీయైక్యతను సాధించారు. చైనా స్వాతంత్ర్యపోరాటం ప్రపంచంలోని బానిసప్రజలందరకు తమ జాతీయ స్వాతంత్ర్యంకొరకు విరోధులతో ఎలా పోరాడాలో చక్కనిమార్గం చూపుతూంది. ఇపుడు అస్సాం రంగంలో పోరాడుతున్న చైనా ప్రజలు ప్రత్యక్షంగా భారతదేశ రక్షణలో పాల్గొంటున్నారు.

చైనా ప్రజల గొప్ప సాంప్రదాయాలను, వీరత్వాన్ని కిసాన్ మహాసభ హృదయపూర్వకంగా అభినందించుతూంది. చైనా ప్రజలు, భారతప్రజలు స్వాతంత్ర్యం సంపాదించి, ప్రపంచపునర్నిర్మాణంలోనూ, ఆసియా పునరుద్ధరణలోను గౌరవప్రదమైన పాత్ర వహించుతారని విశ్వసించుతూంది.

అఖిలభారత కిసాన్‌సభ
నూతన కార్యనిర్వాహకవర్గం

అధ్యక్షులు : స్వామీ సహజానంద సరస్వతి
ఉపాధ్యక్షులు : అచ్చర్‌సింగ్‌చీనా, కార్యానందశర్మ
ప్రధాన కార్యదర్శి : బంకిం ముఖర్జీ
సహాయకార్యదర్శులు : నంబూద్రిపాద్, అబ్దుల్లారసూల్, యదునందనశర్మ, జగజిత్‌సింగ్

కార్యనిర్వాహకవర్గంలో ఆంధ్ర ప్రతినిధులుగా పుచ్చలపల్లి సుందరయ్య, నండూరి ప్రసాదరావుగార్లు ఎన్నుకోబడ్డారు.

ప్రతిష్టంభన పరిష్కారం కొరకు నాయకులను విడుదల చేయాలి

8 వ అఖిలభారత మహాసభ ఈదిగువ తీర్మానం చేసింది.

ఎర్రసేన విజయయాత్రవల్ల యూరప్ యుద్ధంలో ఫేసిస్టులకథ అడ్డం తిరిగింది. ఇంగ్లండు, అమెరికా, చైనా సైన్యాల ఒత్తిడి అంతకంతకెక్కువ అవడంవల్ల తూర్పున జపాన్‌కుగూడ ఆత్మరక్షణకు ప్రాకులాడే గతి పట్టింది. అయినప్పటికీ మనదేశంపై జపాను దండయాత్రా ప్రమాదం ఏమాత్రం తొలగ లేదు. ఇటీవల ఆరకాన్ రంగంలో మిత్ర మండలి వెనుకాడడం. మొన్నమొన్న కలకత్తా, చిట్టగాంగు, అస్సాములపై బాంబులు వేయడం యీ ప్రమాదం యింకా ఉన్నదనే ఋజువుచేస్తున్నవి. గత సంవత్సరం బెంగాల్ చరిత్రలోకెల్ల భయంకరమైన కరువును అనుభవించింది. ఈ సంవత్సరం అంటువ్యాధులూ, మరోకరువు ప్రమాదమూ ఎదుర్కొన్నవి. అంటే, ఆసరిహద్దు రాష్ట్రమును మరీ బలహీన పరుచుతున్న వన్నమాట. ఎదురు దాడి ప్రయత్నాల కొరకు మనుష్యుల, వస్తువుల అవసరంకొద్దీ అంతకంతకూ భారమెక్కువై ఇండియా యొక్క రాకపోకలూ, పరిశ్రమలు ఆర్థికవ్యవస్థ బ్రద్దలౌతూంది. మరి మరీ తీవ్రమౌతూన్న బొగ్గు కొరతవల్ల పరిస్థితులింకా పాడౌతున్నాయి. బర్మా మలయాలలో స్థావరం చేసుకున్న జపాను శక్తులపై సర్వతోముఖమైన, బ్రహ్మాండమైన, ఎదురుదాడిచేయటానికి, చైనాకుముక్తి నీయటానికీ యిండియాను బలమైన రంగంగా మార్చవలసిన తరుణంలో ఆర్థిక, ఆహారసమస్యలు ఎదుర్కొన్నవి; అంతకంతకూ తీవ్రతరమౌతూన్నవి.

కాని యీ క్లిష్ట సమస్యలను ప్రజల సహకారం లేకుండానే, ఫేసిస్టువ్యతిరేకులూ, దేశభక్తులూఐన నాయకులను జైళ్ళల్లో అట్టే పెట్టే, పరిష్కారం చేయగలమని, వేవెలు ప్రభువూ, బ్రిటిషు నిరంకుశాధికారులూ అనుకుంటున్నట్లున్నారు. ప్రజా విశ్వాసపాత్రులైన జాతీయ నాయకులను విడుదల చేయనిరాకరించుతూనే ఉన్నారు. వారిలోవారుగాని, జైళ్ళవెలుపలనున్న వారితోగాని సంప్రదించే అవకాశమైనా ఈయరు. అంతేకాదు, జైలు వెలుపలనున్న ఒకేఒక కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యురాలు శ్రీమతి సరోజినీనాయుడుఇటీవలకాంగ్రెసుయొక్క ఫేసిస్టు వ్యతిరేక పంథాను పునరుద్ఘాటించింది. గౌరవప్రదమైన రాజీకి సూచన చేసింది; జాతీయ ఐక్యతకొరకు, ఆహారంకొరకు కృషి చేయమని కాంగ్రెసు వాదులను హెచ్చరించింది. అయినా ఆమె పైన ప్రభుత్వం వాగ్బంధాన్ని ప్రయోగించింది.

నాయకులను విడుదలచేసి, ప్రతిష్టంభనను పరిష్కారం చేయకపోతే పరిస్థితులింకా విషమిస్తాయనీ, జపానుపై ఎదురుదాడి ఆలస్యమౌతుందని, బలహీనపడుతుందనీ; చైనా, అమెరికా, బ్రిటిషు, ప్రజలయొక్క భారతదేశ ప్రజలయొక్క సమిష్టి ఆశయానికే ముప్పుగల్గుతుందనీ, బ్రిటిషు ప్రభుత్వాన్ని అఖిలభారత కిసాన్ మహాసభ హెచ్చరిస్తూంది. మహాత్మగాంధి, మౌలానా ఆజాదు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మిగిలిన వర్కింగు కమిటీ సభ్యులనూ వెంటనే, విడుదల చేయమని కోరుతూంది.

నాయకుల విడుదల జాతీయ ఐక్యతకూ, ప్రజావిశ్వాసాన్ని చూరగొన్న జాతీయ ప్రభుత్వ స్థాపనకూ అనుకూలమైన వాతావరణం ఏర్పడగలదని కిసాన్‌సభ నమ్ముతూంది. కరువుకాటకాలను జయప్రదంగా అరికట్టడానికీ, కేంద్రప్రభుత్వంయొక్క ఆహారసమస్యా పరిష్కార విధానం ఫలప్రదమై ప్రతివారూ ధరలకంట్రోలు, రేషనింగుద్వారా, తమయొక్క ఆహారాన్ని పొందగలుగుటకూ ప్రతిష్టంభనాపరిష్కారానికి నాయకుల విడుదల ఒక్కటేమార్గము. దీనివల్లనే, జపానుదాడికి ఎదురుదాడిని జయప్రదం చేయడానికి ముందు అవసరమయిన పరిస్థితులు అంటే ఆర్థిక స్థిరత్వం, శాంతి చేకూర్చుతాయి. దీనివల్లనే మనదేశంపైనున్న దాడి ప్రమాదం పూర్తిగా తొలగిపోవడమే గాక, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలనుపొంది జాతుల యొక్క, ప్రజలయొక్క స్వేచ్ఛ, సమానత్వం, సంపూర్ణ స్వపరిపాలనాధికారం (Sovereignty) మీద ఆధారపడి శాంతి భద్రతలు గలిగిన ప్రపంచాన్ని నిర్మింపడంలో మనదేశం తగినపాత్రను నిర్వహించగలుగుతుంది.

బ్రిటను, అమెరికా, న్యూజిలండు, ఆస్ట్రేలియాలలోని కార్మికోద్యమాలూ, ఇతర పురోగామిశక్తులూ, భారతప్రజల న్యాయమైన కోరికను అంతకంతకూ బలపరచాయి. ఫాసిస్టు వ్యతిరేకపోరాటంలో సమిష్టి ప్రయోజనంకొరకు ఇండియాలో జాతీయప్రభుత్వం నెలకొల్పవలెనని కోరారు. కిసాన్‌సభ ఆ కార్మికోద్యమాలతోటీ, పురోగామిశక్తులతోటీ సుహృద్భావాన్నీ, ఐక్యతనూ ప్రకటిస్తూంది.

కరువుకాటకాలను అరికట్టడానికీ, జాతీయ నాయకుల విడుదల కొరకు ఆందోళన చేయటానికీ, ప్రజాఉద్యమంద్వారా ముఖ్యపార్టీల మధ్య, మతాలమధ్య పరస్పర సామరస్యం గలిగించడం ద్వారా, సర్వతోముఖమైన జాతీయ ఐక్యతను నిర్మించడానికి తమ ప్రయత్నాలను ద్విగుణీకృతం చేయమని రాష్ట్రసంఘాలనూ, రైతులనందరినీ అఖిలభారత రైతుమహాసభ కోరుతున్నది.

రైల్వే ప్రయాణాల నిషేధానికి అసమ్మతి

కిసాన్ మహాసభకువచ్చే ప్రతినిధుల, రైతుల ప్రయాణాలకు మద్రాసు ప్రభుత్వం, నైజాంసంస్థానం ఆటంకాలు పెట్టినందుకు యీసభ అసమ్మతి తెలుపుతూంది. ఇలా ఆటంకాలు పెట్టడం రైతుల సభాస్వాతంత్ర్య హక్కును భంగపుచ్చడమేగాక ఫాసిజాన్ని ఎదిరించడానికి, ఆహారసమస్యను పరిష్కరించడానికి, అంటువ్యాధులను ఎదిరించడానికి, ప్రజలను సమీకరించేందుకు అభ్యంతరాలు కల్పించడమే అవుతుంది.

మద్రాసు ప్రభుత్వం యీనిషేధపు ఉత్తరవు ప్రకటించిన వెంటనే, కేంద్రశాసనసభలోని అన్ని పార్టీల సభ్యులు యీ నిషేధానికి వ్యతిరేకంగా పోరాటం సాగించినందుకు యీ సభ కృతజ్ఞత తెలుపుతూంది. శాసనసభలలోనూ, బయటనూవున్న యితర దేశభక్తులుఅదేవిధమైన ఐకమత్యాన్ని చూపుతారనిమహాసభ ఆశించుతూంది. ఆవిధంగా పనిచేయడంవల్లనే ఆహారసమస్యను పరిష్కరించడానికి ప్రజలను సమీకరించగలమని యీసభ నమ్ముతూంది.

ప్రభుత్వం పెట్టిన ఆటంకాలను లెక్కచేయకుండా అన్ని రాష్ట్రాలనుండీ వచ్చిన ప్రతినిధులను అసంఖ్యాకులుగా వచ్చిన ఆంధ్రరైతులను యీ మహాసభ అభినందించుతూంది.

కరువు నివారణకొరకు ఎక్కువపంటలు పండించాలి

8 వ అఖిలభారత మహాసభ ఈదిగువ తీర్మానం చేసింది.

గత సంవత్సరం అఖిలభారత రైతు మహాసభ భాక్నా సమావేశం అధికాహారోత్పత్తి చేయమని హెచ్చరించింది. దేశం తీవ్రమైన ఆహారకొరత, కరువు అనుభవించిన యీ సంవత్సరకాలంలో స్థానికసంఘాలు తమకీయబడ్డ యీ కర్తవ్యాన్ని నెరవేర్చటంలో సాధించిన గణనీయమైన విజయాల పట్ల, అఖిలభారత రైతుమహాసభ సంతోషాన్ని వెలిబుచ్చుతూంది. బెంగాల్ కిసాన్ సభ 70,000 ఎకరాలపైన ఆహారపంటలను అదనంగా పండించుటలో జయంపొందింది. ఆంధ్రకిసాన్‌సభ ప్రభుత్వంనుండి నీటివసతులను, భూమిపన్నుల రెమిషనూ, ఎరువుల సప్లయి మొదలైనవాటినిగూడ సాధించింది.

స్థానికసంఘాలు ఈ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించిన అన్నిచోట్లా, రైతుల నుత్సాహపరచినవి. రైతుపుద్యమాన్ని బలపరచినవి. రైతులను అసంఖ్యాకంగా రైతుసంఘంలోకి తెచ్చినవి. ఇందుకు ఈ సభ సంతోషిస్తూవుంది.

ఈ విజయాలు గొప్పవే అయినప్పటికీ, దేశాన్ని రోజురోజూ తీవ్రమౌతూన్న ఆహారసంక్షోభంనుంచితప్పించజాలినవిమాత్రంగావు. బెంగాలు, కేరళ, ఒరిస్సాలు మరో కరువునెదురుచూస్తూన్నవి. గతసంవత్సరంకన్నా ఈసంవత్సరం పంటతక్కువయ్యేటట్టున్నది. బొంబాయిలోగూడ కరువు వచ్చేటట్లున్నది. కాబట్టి భారతజాతిని ఆకలినుండి కాపాడటానికి ఆహారపంటలను అధికంగా పండించే ప్రయత్నాలను తీవ్రంచేయుట అవసరం. ఆహారం ఎక్కువ పండించకపోతే సరియైన ధరలకు ఆహారంఅందరికీ అందజేయటం అసంభవం.

ఈకర్తవ్యాన్ని నిర్వహించటంలోతీవ్రంగా ఎదుర్కొనవలసిన అడ్డంకులు చాలగలవని రైతుమహాసభ అనుభవం తెలుపుతూంది. రాష్ట్రప్రభుత్వాలు, యింకా మిగిలివున్న లక్షలాది ఎకరాల బంజర్లను సాగుచేయటానికి రైతుల కింకా యివ్వలేదు. చచ్చిపోవటంవల్లా, మరి యితర కారణాలవల్లా పశువులు కొరతఅయినాయి; కూలీలుగూడ తక్కువైనారు. విత్తనాలు, ఎరువులు, నీటి వనరులు, పనిముట్లు, క్రూడ్ఆయిలు, ఇంజన్లు మొదలయినవాటి సప్లయి ఏమీ చాలడంలేదు. తగినంతగా సప్లయి చేయటానికిగూడ ప్రభుత్వం శ్రద్ధవహించడంలేదు.

అధికాహారోత్పత్తి ఉద్యమం అభివృద్ధి చెందడానికి, రైతులకుగల అడ్డంకులను తొలగించాలి. అందుకొరకీ క్రిందపేర్కొన్న విధానాన్ని వెంటనే అమలు జరపాలని ఆయా ప్రభుత్వాలను యీ మహాసభకోరుతూంది.

(ఎ) సాగుకు లాయకీఅయిన బంజరు పొలాన్నంతనీ ప్రభుత్వానిదైనా, ప్రయివేటు వ్యక్తులదైనా సాగుకు ఇవ్వాలి.

(బి) పరీక్షచేసిన విత్తనాలను, చౌకగా ఎరువునూ, అదునులో, చాలినంత సప్లయి చేయాలి.

(సి) పెద్దవీ, చిన్నవీ, ప్రాజెక్టులనునిర్మించి ఎక్కువ ఇరిగేషన్ వసతులను కల్పించాలి.

(డి) రైతులకు ప్రభుత్వంచేత యివ్వబడిన వ్యవసాయ ఋణాలపై యుద్ధం నడిచినంతకాలానికి మారిటోరియం ప్రకటించాలి.

(ఇ) వ్యవసాయదారుని పైనున్న పన్నులు, కౌలుమక్తాలభారం తగ్గించడానికి చట్టంచేయాలి.

(యఫ్) కరువుమూలంగా లాక్కోబడినటువంటి లేక అన్యాక్రాంతమైన భూములను తిరిగి వారివారికి స్వాధీనపరచాలి.

ఆహారపరిస్థితులను చక్కపర్చమని ప్రభుత్వాన్ని కోరటమే రైతులపనిగాదు. దేశాన్ని ముందెదుర్కొనున్న ఆహారపరిస్థితి ఎంతో భయంకరమైనది; రానున్న అట్టిపరిస్థితులను చక్కపర్చడంమీదనే దేశభవిష్యత్తు ఆధారపడి వున్నది. రైతుప్రజాసామాన్యమంతటినీ ఒక ప్లాను ప్రకారం కార్యక్రమంలోకి తెచ్చినప్పుడే, అలాంటి పరిస్థితులు చక్కబడగలవనీ, కిసాన్‌సభ అభిప్రాయపడుతూంది.

కాబట్టి కిసాన్‌సభ కర్తవ్యమేమంటే, రైతులు తమకొరకు, ప్రజలకొరకు, మరోసారి కరువురాకుండా నివారించటంకొరకు, అధికంగా పంటలు పండించవలసిన బాధ్యత రైతువర్గానిదేనని తెలియజెప్పటానికి వెంటనే ఆందోళన సాగించాలి.

కిసాన్ సభయొక్క నిర్మాణమూ, ప్రజా సమీకరణశక్తిపైన ఆహారసమస్యాపరిష్కారం చాలవరకు ఆధారపడివుంది.

ఇది దేశమంతటా విశాలమైన ఆత్మసహాయకోద్యమం నిర్మించడంద్వారానే సాధ్యపడుతుంది. ప్రతి గ్రామంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ రైతులకూ మిగతా గ్రామస్థులకూ మధ్య పరస్పర సహకారభావం కలుగజేయడంద్వారా ఆహారపంటల నెక్కువచేయటమే ఈ వుద్యమానికి మూలసూత్రం. ఈ వుద్యమంయొక్క ప్రత్యేక కర్తవ్యాలు —

(ఎ) రైతులను, మిగిలిన గ్రామస్థులను ఐక్యపరచి, సంఘటితపరచుట.

(బి) భూమి, పనివాళ్ళు, పశువులు, పనిముట్లు, విత్తులు, ఎరువులు మొదలైనవి యెంత దొరికేదీ అంచనావేసి, వాటి వుత్పత్తి సాధ్యమైనంత ఎక్కువగా అభివృద్ధి చేయడానికి వుపయోగించడం.

ఇందువల్ల రైతులయొక్క, సర్వ ప్రజలయొక్క క్షేమంకొరకు అధికాహారోత్పత్తి కార్యక్రమం కిసాన్ సభయొక్క ప్రధాన కర్తవ్యమౌతుంది. కాబట్టి కిసాన్‌సభ స్థానిక సంఘాలు యీ కార్యక్రమాన్ని జాగ్రత్తగా సాధకబాధకాలను అర్థంచేసుకొని శ్రద్ధగా చేపట్టవలసియున్నది. ఇలా రైతులూ, గ్రామస్థులూ ఐక్యతతో నిర్మాణయుక్తంగా అధికాహారోత్పత్తి ఉద్యమాన్నిసాగించినట్లయితే వారి కోర్కెలను ప్రభుత్వంచేతగూడ ఒప్పుకునేట్లు ఒత్తిడి చేయగలరు.

కమ్యూనిస్టుపార్టీ ★ కిసాన్‌సభల మధ్య ఐక్యత



— కామ్రేడ్ జి. అధికారి —

(7 వ పేజీ తరువాయి) రెండూ ప్రజాసంస్థలే. ఒకవైపు మన దేశసరిహద్దులలో విదేశీదురాక్రమణదారులు పొంచికూర్చుని ఉన్నప్పుడు, మరొకవైపు ప్రభుత్వాధికారం అంతా సామ్రాజ్యవాదుల చేతులలో ఉన్నప్పుడు, కిసాన్‌సభ, భారత కమ్యూనిస్టుపార్టీ దేశానికి చక్కని మార్గం చూపాయి. "దేశరక్షణకై జాతీయ ప్రభుత్వం అవసరం; దాన్ని స్థాపించాలంటే, జాతీయైక్యతను సాధించాలి." అని దిక్కులు పిక్కటిల్లేటట్లు దేశానికి చాటుతున్నాయి. మన స్వాతంత్ర్యపోరాటం ప్రపంచప్రజల స్వాతంత్ర్యపోరాటంలో ఒక భాగమని రెండుసంస్థలూ గుర్తించాయి. ఇంతేకాదు, ఆగస్టు ఘటనల సందర్భంలో ప్రజలు చాలాచోట్ల అరాజక చర్యలకు పూనుకొంటూంటే, ఈ రెండు సంస్థలూ యెలుగెత్తి ఇదిస్వాతంత్ర్యపోరాటం కాదనీ, ప్రజలెవరూ అందులో పాల్గొనవద్దనీ, ప్రకటించాయి. ఇది పొరబాటు దృక్పథమని అప్పట్లో చాలామంది విమర్శించారు. కాని, 2 సంవత్సరాల తరువాత కిసాన్‌సభ 2 లక్షల నుండి 5 లక్షలకు పెరిగింది. ఈపాలసీయే సరియైనదని రుజువుచేయడానికి యీ మహాసభే చాలు.... ఈరోజున దేశంయొక్క ఆర్థిక నిర్మాణం అంతా రైతులపైఆధారపడియుంది. దేశాన్ని కరువుబాధనుంచి రక్షించగలవారు మీరే. అధికంగా పంటలుపండించి, ప్రజల్ని పోషించగలవారు మీరే. దేశంలో ఐక్యతను నెలకొల్పగలిగినవారుకూడా మీరే. కనుకనే మీవైపు కాంగ్రెసువాది, లీగ్ సభ్యుడు, ప్రతి దేశభక్తుడు, చూస్తున్నాడు. అన్నిపార్టీలకు చెందిన దేశభక్తులు కిసాన్ సభ చేరి, దాన్ని బలపరచవలసిందని కోరుతున్నారు. కొందరు కిసాన్‌సభ బలాన్నిచూచి ఓర్వలేక, అనేకవిధాల దుష్ప్రచారం చేస్తున్నారు, రైతుఉద్యమాన్ని విచ్ఛిన్నంచేయాలని చూస్తున్నారు. కాని, అట్టి ప్రయత్నాలన్నీ విఫలం కాకతప్పదు. కమ్యూనిస్టుపార్టీకి, కిసాన్‌సభకు మధ్యగల ఐక్యతను విచ్ఛిన్నంచేయడానికి జరిగే కుటిలప్రయత్నాలుకూడా కొనసాగవు. ఎందువల్లనంటే, రెండు సంస్థలూ యిచ్చే కార్యక్రమమే సరియైన స్వాతంత్ర్యపోరాట కార్యక్రమం. నిన్నటి ప్రజాసంరంభం ప్రపంచంతో సంబంధంలేని ఘటనకాదు. ప్రపంచమంతటా ప్రజలు తమ స్వాతంత్ర్యసిద్ధికై చూపే సంరంభంలో యిదికూడా ఒకభాగం. స్వామీజీ నాయకత్వం కింద కిసాన్‌సభ యింకా బలీయమైన సంస్థగా అయి, భారతదేశ రైతాంగానికి సరియైన కార్యక్రమం యిస్తుందని నమ్ముతున్నాము."

తరువాత, తంజావూరు కమ్యూనిస్టు డిటెన్యూల తరఫున కామ్రేడ్ ప్రతాప రామసుబ్బయ్య కిసాన్‌సభకు జోహారు లర్పిస్తూ ఒక సందేశం చదివారు.

తీర్మానాలు, ఉపన్యాసాలు

సందేశాలు పూర్తి అయాక, విషయ నిర్ణయ సభలో ఆమోదించబడిన తీర్మానాలు మహాసభలో ఒకటి తర్వాత మరొకటి ప్రతిపాదించబడ్డాయి. అన్నీ ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. కిసాన్‌సభ పాలసీనిగురించిన తీర్మానం ప్రతిపాదిస్తూ కామ్రేడ్ బంకింముఖర్జీ ఉపన్యసించారు. కామ్రేడ్ యదునందనశర్మ (బీహారు) తీర్మానాన్ని బలపరుస్తూ యిలా చెప్పారు:

"కిసాన్‌సభను కమ్యూనిస్టులు వశపరచుకొన్నారనే నింద ఆధార రహితమైనది; అట్టి ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. కమ్యూనిస్టుల నిఘంటువులో "ఇతరుల నెత్తిపై రుద్దడం" అనే శబ్దం లేనేలేదు. ఈ సంగతి బట్టలుమోసే గాడిదకు సహితం తెలుసు. బ్రిటన్, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలో మార్క్సు, లెనిన్‌లపైన, సోషలిజంపైన సామ్రాజ్యవాదు లనేకవిధాల దుష్ప్రచారం చేశారు. కాని, మార్క్సు, లెనిన్ సిద్ధాంతాలుగాని, సోషలిజంగాని, నాశనం కాలేదు. నిందలువేసిన సామ్రాజ్యవాదులే నశిస్తున్నారు. లెనిన్, "మీరు జీవించాలంటే రైతులతో జీవించాలి; చనిపోవాలంటే రైతులతో చనిపోవాలి" అన్నాడు. కమ్యూనిస్టు సోదరులు యీ సూత్రాన్ననుసరించి కిసాన్ సభలో పనిచేస్తే, భారతదేశ స్టాలిన్ అయిన జోషీ నాయకత్వాన మనదేశంలో కార్మిక కర్షక ప్రజారాజ్యాన్ని స్థాపించవచ్చు".

కామ్రేడ్ యదునందనశర్మ స్వామీజీకి కుడిభుజం వంటివాడు. కమ్యూనిస్టుకాడు. కమ్యూనిస్టులతో అనేక పర్యాయాలు వ్యతిరేకిస్తూ వచ్చాడు. అయినా, ఆంధ్రదేశంలో ఇంత రైతాంగం సమీకరించబడ్డం చూచి ముగ్ధుడయాడు. ఈయన ఉపన్యాసం కిసాన్ సభ—కమ్యూనిస్టు ఐక్యతను బలపరచగలదు.

తీర్మానాలన్నీ ఆమోదించబడిన తరువాత కామ్రేడ్ పృధ్వీసింగు కరతాళధ్వనుల మధ్య లేచి, యిలా ఉపన్యసించారు:

"మీ తెలుగుగడ్డలో ఎంతో ఆకర్షణశక్తి వుంది. అందువల్లనే కాబోలు రైలు తెలుగు దేశంలోనుంచి పోతూండగా కిందికి దూకేశాను. తీవ్రమైన గాయాలుతగిలాయి. ఒకవైపుకి నడిచాను. బొమ్మజెముడు పొదలలో పడ్డంవల్ల ముళ్ల గుచ్చుకోనిప్రదేశం శరీరంలో మిగలలేదు. అంతా నెత్తురుమయం, కాళ్లకూ చేతులకూ సంకెళ్ళు. ఆ చీకట్లో మినుకు మినుకుమని ఒకవైపు వెలుగు కనపడింది. ఒక పేదరైతు గుడిసె అది. సంకెళ్ళను గలగల మ్రోగించి, వారిని మేల్కొలిపాను. వారు గాభరాగా కేకలు వేయబోయారు. ముక్కుమీద వేలుఉంచి, కేకలు వేయవద్దని సంజ్ఞచేశాను. నాకు మీ భాషరాదు. రెండు మాటలు మంత్రంలాగ పనిచేశాయి. అవి: "దేశభక్తం", "స్వరాజ్యం." మూడుసార్లు జపించాను. వారికి అర్థం అయింది. జరగవలసినదంతా అనుకూలంగానేజరిగింది. నేను కిసాన్ కుటుంబంలో పుట్టాను. అమెరికాలో కార్మికుడుగా పనిచేశాను. రష్యా చూచిన తర్వాత కమ్యూనిస్టునయ్యాను. రష్యాలో రైతు - కూలీలు తొక్కినమార్గాన్నే మీరు కూడా పోవాలి"

మహాసభ ముగింపుకి వస్తోంది. స్వామీజీ అంత్యోపన్యాసం యిస్తూ, యిలాచెప్పారు: "నాకూ, కమ్యూనిస్టు సోదరులకూ, యిటీవల వైమనస్యం ఏర్పడినట్లు ఒక పొరబాటు అభిప్రాయము ఏర్పడింది. అభిప్రాయభేదాలుంటే ఉండవచ్చు, కాని, సమిష్టిగా చర్చించి, నిర్ణయాలకు వస్తాం, అందరం కలిసి చిత్తశుద్ధితో రైతుసంఘానికి సేవచేద్దాం. కమ్యూనిస్టుల ప్రాబల్యం అంటూ చౌకబారుగా నిందలు మోపేవారు సంఘంలోచేరి కమ్యూనిస్టుల కంటె ఎక్కువగా సేవచెయ్యడానికి ముందుకు రావాలని కోరుతున్నాను."

బెజవాడ యందలి వివిధ కార్మికసంస్థల తరఫున రు. 360 విలువచేసే ఒక రైతు-కూలీ విగ్రహం (వెండిది) సన్మానసంఘానికి కానుకగా యిచ్చారు. ఈవిధంగా పట్టణాలలోను, పల్లెలలోను, నివశించే కష్టజీవుల ఐక్యత ప్రకటించబడింది.

ఐక్యతా పిక్చర్ ప్యాలస్

మహాసభముగియగానే బయటికొచ్చాను. కొమ్మారెడ్డి గేటు కెదురుగా ఒక పెద్దగుంపు నిలబడివుంది. ఏమిటా అని చూచాను. "ఐక్యతా పిక్చర్ ప్యాలస్" అని వ్రాయబడిన 'చుక్కాని పెట్టె' చూచాను. పైన ఒకవైపున స్టాలిన్ ఫొటో, మధ్య ఎర్రజండా, దాని ప్రక్క టాన్యా ఫొటో అంటించబడి వున్నాయి. ముగ్గురు రైతులు అద్దాల గుండా పెట్టెలోకి తొంగిచూస్తున్నారు. ప్రక్కనే ఒక మనిషి నిలబడి ఒక్కొక్క దృశ్యాన్ని వర్ణిస్తున్నాడు. "అదుగోజోషీ, అదుగో రెడ్ ఆర్మీ, అదుగో స్టాలిన్, ఆమెయే వీరవనిత టాన్యా...." అని వర్ణిస్తూ వచనగీతాలు పాడుతున్నాడు. ఆవ్యక్తి ఒక్క అరగంటలో పదిఅణాలు సంపాదించాడు. ఇతనే యిన్నాళ్లూ శ్రీరంగం, రామేశ్వరం, గయ, మొదలైన పుణ్యక్షేత్రాల పటాలు చూపుతూ పొట్టపోసుకునే వాడట. ఇప్పుడీవిధంగాచేస్తూ పొట్టపోసుకోవడంతోబాటు, ప్రజలకు విజ్ఞానాన్ని వెదజల్లుతున్నాడు.

అడ్డంకులు

మొదటినుంచీ మహాసభకు ఆటంకాలే కలిగాయి. మహాసభకు పెండాల్ వేస్తుంటే మూడు రోజులు ముసురుపట్టింది, మహాసభను వర్షం చెడగొట్టుతుందేమోనని భయపడ్డాం. రైలుప్రయాణంమీద ప్రభుత్వం ఆంక్ష విధించింది, బస్సులలో ప్రయాణాలు నిషేధించబడ్డాయి. కొన్నిచోట్ల పడవలమీద ప్రయాణం కూడా ఆపుజేయబడింది. అంటువ్యాధులు వ్యాపిస్తాయనే కారణంతో ఏ క్షణం అయినా మహాసభను ఆపుజేయవచ్చుననే బెదరింపులు వచ్చాయి. ఇక, రైతుసంఘ విచ్ఛిన్నకుల విషయం. వెనకటికి, సముద్రం పొంగి వస్తూంటే ఒకదేభ్యం మోకాలు అడ్డం పెట్టాడట! జపాన్‌వాళ్ళొచ్చి బాంబులు వేస్తారనీ, పోలీసులు తుపాకులు కాలుస్తారనీ, యింకా ఎన్నెన్నో పుకార్లు లేవదీసి ప్రజలలో భీతావహం కలిగింప జూచారు. కాని, బోర్లపడ్డారు అన్ని అడ్డంకుల్నీ తోసివేస్తూ రైతుప్రజాసామాన్యం తండోపతండాలుగా మహాసభకు హాజరై, తమ వర్గసంస్థయైన కిసాన్‌సభ యెడల స్థిరవిశ్వాసాన్ని ప్రకటించారు.

కిసాన్ వర్కర్ల సంతోషానికీ, ఉత్సాహానికీ మేరలేదు, ఆనందంతో పరవశులయారు. కిసాన్‌సభ యింతవరకు సాధించింది ప్రశంసించదగ్గదే. కాని, చేయవలసిన పని ఇంకా యెంతో ఉంది. ఇంతవరకు చేసినది కొద్దిపాటే, కిసాన్ సభలో చేరని రైతు ఉండకూడదు. అన్నిపార్టీలకు చెందిన దేశభక్తులు రైతుసేవకులై కిసాన్‌సభలో చేరేటట్లు చూడాలి. సంఘంయొక్క బలాన్ని ఇంకా యెన్నో రెట్లు బలపరచాలి.

యుద్ధ ఋణపత్రాలు యుద్ధ ఫండులు

8 వ అఖిలభారత మహాసభ ఈదిగువ తీర్మానం చేసింది.

సాధారణంగా మన దేశంలోని రైతులు చాలా బీదవారు. వారు నేడు అతి విషమపరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈనాడు మరింత భారాన్ని మోసేస్థితిలో రైతులులేరు. గవర్నమెంటు సేవింగు సర్టిఫికెట్స్, (యుద్ధ బాండులు) డిఫెన్సుఫండ్సు (యుద్ధఫండ్సు) మొదలైనవాటిని, పైనచెప్పిన బీదరైతులనుండి వసూలుచేయడం మానివేసి యుండవలసింది. ధనవంతులైనట్టియు, రోజురోజూ ధనికులౌతున్నట్టివారినుండి ఈ ఫండ్సును వసూలు చేయాలి. ఈ ఫండ్సును వసూలు చేయుటలో నిర్బంధంలేదని, ఇచ్ఛాపూర్వకంగానే ప్రజలు ఇవ్వవచ్చునని ప్రభుత్వం ప్రకటించింది. కాని ప్రభుత్వోద్యోగులు, తాము ఫండ్సును వసూలు చేయాలనే ఆతృతలో రైతులపైన, బీదలపైన చాలా ఒత్తిడి తెచ్చారు.

డిఫెన్సుఫండ్సుకు సేవింగ్ సర్టిఫికెట్సుకు డబ్బు వసూలుచేయుటలో విచక్షణారహితంగా ప్రవర్తించుటను అలిండియా కిసాన్‌సభ ఖండించుతోంది. అలా ప్రవర్తించడంవల్ల, ప్రభుత్వం ఏ వుద్దేశ్యంతో ఈ ఫండ్సును వసూలుచేస్తూవుందో ఆ వుద్దేశ్యమే తుదకు భగ్నం అవుతుందని కిసాన్‌సభ హెచ్చరించుతోంది. పై ఫండులను వసూలు చేయుటలో ప్రభుత్వోద్యోగు లవలంబించే వైఖరిని కనిపెడుతూవుండాలని; ప్రజలపై తీసుకువచ్చే ప్రభుత్వోద్యోగుల ఒత్తిడిని బహిరంగపరుస్తూ అలిండియాకిసాన్‌సభకు, ప్రభుత్వానికి తెలియజేయాలని; ఆవిధంగా స్థానికోద్యోగులజులుం నుండి బీదరైతులను, ప్రజలను కాపాడాలని; అ. భా. కి. సభ రైతుసంఘ ఆర్గనైజరులూ స్థానిక రైతుసంఘాలను హెచ్చరించుతోంది.

మంచిజాతి పశుసంపదను వృద్ధిచేయాలి

●



పశుప్రదర్శనలో

ఆరు ఎకరాల భూమిలో, అతివిశాలంగా నిర్మింపబడిన పందెళ్ళలో వివిధప్రాంతాలనుండి ప్రదర్శనానికివచ్చిన పశువులు మోరలెత్తుకుని నిలబడివున్నాయి. ఆబోతులు, గిత్తలు, ఎడ్లు, ఆవులు, దున్నలు, గేదెలు మున్నగు పశువులను చూస్తోంటే పోటీలలో ఒకదానినొకటి ఓడించడానికి ఉగ్రూతలూగు తున్నట్లనిపించింది.

"మూడుసంవత్సరాలనుండి జరిగిన ఏప్రదర్శనానికికూడా ఇటువంటి మేటిపశువులు రాలేదు. సంఖ్యలో ఎక్కువగాక పోయినప్పటికీ జాతిలో సరియైన ఎడ్లజతలనూ, మంచిజాతి ఆబోతులనూ, ఎక్కువపాలనిచ్చే గేదెలనూ, ఆవులనూ చూడడానికి ఈప్రదర్శనం ఒక చక్కనిఅవకాశాన్నిచ్చింది" అన్నారు హార్లే (డైరెక్టర్ ఆఫ్ వెటర్నరీ సర్వీసెస్) తో సహా పశువైద్యశాఖవారంతా ఏకగ్రీవంగా. గత 3 సంవత్సరాల పోటీలలోనూ జడ్జిగావుంటున్న వుప్పలపాటి రామరాజుగారుకూడా పై విధంగానే అన్నారు.

15 వ తేదీ ఉదయం 8 గంటలకు వందలకొలది వాలంటీర్లు జనసమూహాన్ని నియమిత ప్రదేశాలలో సర్ది కూర్చొబెట్టారు. సువిశాలంగా నిర్మింపబడిన రింగులోనికి ఆబోతులూ-దున్నలూ, ఎడ్లూ, దూడలూ, వకరకం వెంబడి ఇంకొకరకంవచ్చి తిరుగుతోంటే జడ్జీలు గెలుపొందిన పశువులను నిర్ణయించసాగారు. ఎప్పటి కప్పుడు ఏ యే పశువులు ఏ యే బహుమతులు గెల్చుకొన్నదీ మైక్రొఫోన్‌ద్వారా ప్రజలకువినిపింపబడింది. గెలుపొందిన పశువుల్ని ఇండియన్ న్యూస్‌రీల్సువారు ఫోటోలుతీశారు. యమధర్మరాజు వాహనంవలెనున్న దున్నపోతుమీద ఒకరు ఎక్కి స్వారిచేస్తూంటే, ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీయడానికి ఉరకలుపెట్టిన దృశ్యం మరువరానిది. ఈ విధంగా పోటీలు 1 గంటవరకూ జరిగినాయి. ప్రజలంతా రింగు బయట నిశ్శబ్దంగా బారులుదీరి కూర్చున్నారు. ఏవిధమైనరొద, తొక్కిడీలేదు. ప్రజలకుకావలసిన మంచినీళ్ళు వాలంటీర్లు అందిస్తున్నారు. మైక్ ద్వారా గెలుపువార్తలు వినిపింపబడుతున్నాయి. దీనినంతాచూచిన ఒక పెద్దమనిషి సంతోషంతో ఇలా అన్నాడు: "నేను అనేక చోట్ల ప్రభుత్వంచే ఏర్పాటుచేయబడిన పశుప్రదర్శనాలను చూచాను. కలెక్టర్లు, పశువైద్యశాఖవారూ, వ్యవసాయ శాఖవారూ, పోలీసు ఉద్యోగులూ ఉండిగూడా ప్రతి ప్రదర్శనంలోనూ గలభా, తొడతొక్కిడి, కొట్లాటలూ, మూకలు విరగబడడమూ జరుగుతూందేది. ఇక్కడ అలాంటి దేదీలేకుండా, యెంతో చక్కగా ప్రదర్శనం జరిగేటట్లు రైతుసంఘంవారు చేయగలిగారు. ప్రభుత్వం చేయలేని పనిని రైతుసంఘంవారు చేశారంటే అందుకువారి నెంతో అభినందించ వలసియున్నది."

ఈలాంటి అభిప్రాయాలతో ప్రదర్శనాన్ని చూచినవారంతా తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

పోటీలను చూచినవారిలో కొద్దిమంది బండలాగుడుకూడా పెడితే బాగుండేదనుకున్నారు. కాని రైతుకు కావలసినది పెద్ద బండలాగే పశువులుకాదు. ఆ విధంగా బండలాగుడు పోటీలకు కొంతమంది రైతులు ఆస్తులమ్మి పశువులను మేపుతున్నారు. వ్యవసాయ పనిని చేయించడంలేదు. కండలు పెరిగిన ఆ పశువులు రైతుకు దండుగగావుంటున్నాయి. పోటీలుకూడా రైతులకు ప్రోత్సాహాన్ని యిచ్చేవిగాక కోడిపందాలు, గొర్రెపొట్టేళ్ల పందాలవలె పరిణమించినాయి. పోటీలు ఏర్పరచినవారికి లాభాలు, పోటీలకు పశువులను తెచ్చినవారికి నష్టాలూ, ఫలితం పోట్లాటలూ - ఇవీ బండలాగుడు పోటీల వల్ల కలిగే ఫలితాలు. అందుచేత రైతుసంఘంవారు అలాంటి పోటీలు పెట్టదలచుకోలేదు. రైతుకు వ్యవసాయానికి ఎటువంటి పశువులు లాభదాయకం? ఏ జాతివి మంచివి? ఎలా పోషించాలి? పశుసంపదను వృద్ధిచేయడానికి ఏ మార్గాలవలంబించాలి? అనే విషయాలను రైతులకు బోధించడానికి, మంచి పశువులను పెంచినవారికి ప్రోత్సాహాన్ని కలుగజేయడానికిఉద్దేశించి పశుప్రదర్శనాన్ని ఏర్పాటుచేసి రైతుసంఘంవారు ఆదర్శప్రాయులయ్యారు.



పశుప్రదర్శనలో

రాత్రి విజ్ఞాన ప్రదర్శనాలు అయినవిమ్మట 8 గంటలకు కామ్రేడ్ పి. సి. జోషి (అఖిల భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి) గెలుపొందినవారికి బహుమతులు పంచిపెట్టారు. ఆబోతులు, ఎడ్లజతలు, గిత్తలు (బుడ్డవేయనివి) గేదెలు, ఆవులు, దున్నలు మున్నగు వాటికి మొత్తం రు 1060/- లు విలువగలిగిన వెండిగంటలు, కప్పులు బహుమతులుగా యివ్వబడినాయి. ఎడ్లజతలలో 1, 2, 3 తరగతులుగా జడ్జీలచే నిర్ణయింపబడిన 3.జతలలోనూ ఏజత మొదటిది? ఏది తరువాతిది? అనే విషయం నిర్ణయించుటకు వీలులేదని పశుప్రదర్శన కమిటీ 3 జతలకు కూడా మొదటిబహుమతులైన వెండిగంటలనే యిచ్చారు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE